ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 01 సంచిక -365 పేజీలు - 08 వెల - 06/-
శనివారం 12 ఏప్రిల్ 2025

### పూలే జయంతి సందర్భంగా

# సిఎం రేవంత్ నివాళులు



హైదరాబాద్, ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్: :మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. సిఎం రేవంత్ సహా మంత్రులు తదితరులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంబర్ పేటలో ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. పూలే విగ్రహానికి నివాళులు అర్పించిన వారిలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, నియోజకవర్గ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# వైభవంగా ఒంటిమిట్ట కళ్యాణోత్సవం

### పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు దంపతులు



**కడప,ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్:** ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం కన్నులు పండుగ జరిగిందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేదికపై నుంచి సీతారాముల కల్యాణం తిలకించారు. అనంతరం వేడుకను ఉద్దేశించి ప్రసంగించారు. పరిపాలన అంటే రామ పాలన జరగాలని అందరూ కోరుకుంటారన్నారు. త తిరుపతి నుంచి ఒంటిమిట్ట వచ్చే సర్క్యూట్ ను అభివృద్ధి చేయాలి. కొండలపై ఆయుర్వేద మొక్కలు నాటాలి. టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తాం. టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తాం. దేవాలయాలు లేకుంటే కుటుంబ వ్యవస్థ ఉండేది కాదు. ప్రపంచంలో ఇటువంటి వ్యవస్థ లేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రామరాజ్యం తేవడమే నా ఆకాంక్ష అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీరాముని సాక్షిగా రాష్ట్రం ప్రతిఒక్కరికి న్యాయం చేస్తానని.. భారత దేశం ప్రధాని నాయకత్వంలో రామరాజ్యం గా అభివృద్ధి చెందుతుందన్నారు.

### మంగళగిరిలో తొలి

# లీప్ పాఠశాల

### అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు

### ఇళ్ల పట్టాల పంపిణీలో నారా లోకేశ్



అమరావతిఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్:
లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం చుడుతున్నామని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాలను మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఓ క్రమపద్ధతిలో నెరవేరుస్తోందని అన్నారు. ఇచ్చిన ప్రతీ హామీ నిలబెట్టుకుంటామని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. మంగళగిరికి మంజూరైన ఆంధ్రప్రదేశ్‌లో తొలి వందపడకల ప్రభుత్వ ఆస్పత్రికి 13వ తేదీన శంకుస్థాపన చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు మిగతాది 2లో...




### బిసిల అభ్యున్నతికి

# కృషి చేస్తున్నాం

### ఆడవాళ్ల వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు : సీఎం చంద్రబాబు

- తప్పులు చేసే వారి పట్ల చండశాసనుడిగా ఉంటానని స్పష్టీకరణ
- ఆడపిల్లల క్యారెక్టర్ గురించి చెడుగా మాట్లాడడమేంటని ఆగ్రహం
- బిసిల అభ్యున్నతికి అందరం కృషి చేస్తున్నాం
- టిడిపికి ముందునుంచీ బిసిల వెన్నుదన్ను
- అగరిపిల్ల వడ్లమాడులో బిసిలతో ప్రజావేదిక
- పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు
- కులవృత్తుల వారికి అండగా నిలిచామన్న సిఎం చంద్రబాబు

2లో



# నేడు ఎపి ఇంటర్ ఫలితాల ప్రకటన

### అధికారిక వెబ్‌సైట్..వాట్సాప్‌లో వెల్లడి

### ఫలితాలపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లోకేశ్



2లో

# గోరంట్ల మాధవ్‌కు 14 రోజుల రిమాండ్...



- నెల్లూరు జైలుకు తరలింపు
- చేబ్రోలు కిరణ్ ను తరలించే సమయంలో
- రభస సృష్టించిన గోరంట్ల మాధవ్
- పోలీసులతో దురుసు ప్రవర్తన
- అరెస్ట్ చేసిన పోలీసులు
- మొబైల్ కోర్టులో జడ్జి ఎదుట హాజరు

2లో

### తమిళనాడులో బీజేపీ-అన్నాడీఎంకే

# పొత్తు ప్రకటించిన అమిత్ షా

- అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని వెల్లడి
- పళనిస్వామి సారథ్యంలో ఎన్నికలకు వెళతామన్న అమిత్ షా
- పొత్తు కోసం ఎలాంటి షరతులు, డిమాండ్లు పెట్టలేదని స్పష్టీకరణ
- ఇది ఆహ్వానించదగ్గ పరిణామం అన్న పవన్ కల్యాణ్



ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్: తమిళనాడులో అన్నాడీఎంకే, బీజేపీ పొత్తు ఖరారు అయింది. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఈ మేరకు కేంద్ర మంత్రి అమిత్ షా అధికారిక ప్రకటన చేశారు. పళనిస్వామి నాయకత్వంలోనే అన్నాడీఎంకే ఎన్నికలకు వెళుతుందని ఆయన స్పష్టం చేశారు.మిగతాది 2లో...

### అభివృద్ధి..వారసత్వం

# లక్ష్యంగా పయనం

- 2036 ఒలంపిక్స్ కోసం భారత్యత్నం
- విపక్షాలది కుటుంబ రాజకీయం
- వారికి అభివృద్ధి కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం
- వారణాసిలో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం
- ఇటీవలి అత్యాచార ఘటనపై అధికారులతో ఆరా




2లో



# బనకచర్లపై ఏపీ ముందుకు వెళ్లకుండా చూడండి

: జీఆర్ఎంబీకి తెలంగాణ లేఖ

- గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు లేఖ రాసిన తెలంగాణ నీటి పారుదల శాఖ ఈఎన్సీ
- పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతలపై టెండర్లు చేపట్టకుండా చూడాలని విజ్ఞప్తి
- ఈ నెల 7వ తేదీన జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించామని వెల్లడి

2లో

రిపబ్లిక్



# బిసిల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం



ఏలూరు,ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్:
సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తే అదే వారికి చివరి రోజు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. ఏలూరు జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడుతూ, తప్పులు చేసే వారి పట్ల చండశాసనుడిగా ఉంటానని స్పష్టం చేశారు వైసీపీ హయాంలో రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని, ఇప్పుడు తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని అన్నారు. వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ పై కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకున్న నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నాడు అసెంబ్లీలో తనను బూతులు తిట్టారని చంద్రబాబు వెల్లడించారు. అది కౌరవ సభ అని, గౌరవ సభగా మారాకే మళ్లీ సీఎంగా అసెంబ్లీలో అడుగుపెడతానని చెప్పానని గుర్తు చేసుకున్నారు. ఆడపిల్లల వ్యక్తిత్వాల గురించి చెడుగా మాట్లాడితే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. త్వరలో బీసీ సంరక్షణ చట్టం తీసుకువస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మహాత్మా జ్యోతి రావు పూలే గారి స్ఫూర్తితో ఈచట్టం తెస్తున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ వచ్చాకే వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగిందిన అన్నారు. బీసీలకు ఉద్యోగాల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. జిల్లాల వారీగా బీసీ భవన్ ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. బీసీ వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో బీసీ విద్యార్థుల కోసం సివిల్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు ఇస్తున్నామని, ఈ ఏడాది లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని చంద్రబాబు వెల్లడించారు. త్వరలోనే అందరికీ తల్లికి వందనం అందిస్తామని చెప్పారు. ముఖ్యంగా, రాష్ట్ర రైతాంగానికి అండగా ఉంటామని, లాభదాయకమైన వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని తెలిపారు. మే నెల నుంచి రైతులకు విడతల వారీగా రూ.20 వేలు అందజేస్తామని వివరించారు. కోర్టు సమస్యలు పరిష్కరించి త్వరలోనే చింతలపూడి ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. పీ-4తో సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. సంపద అనేది ఒకరికే పరిమితం కాకూడదని అభిప్రాయపడ్డారు. 10 మంది సంపన్నులు 20 మంది పేదలకు చేయూతనివ్వాలన్నదే తమ అభిమతం అని వివరించారు. ఆగిరిపల్లిలో 206 పేద కుటుంబాలను గుర్తించామని, అర్హులందరికీ స్థలం ఇచ్చి ఇల్లు కట్టాకే మళ్లీ ఓట్లు అడుగుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అనువుగాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చిందని విమర్శించారు.



# మంగళగిరిలో తొలి లీప్ పాఠశాల



**(మొదటి పేజీ తరువాయి)**
. ప్రతిపక్షంలో ఉండగానే మంగళగిరి కోసం సొంత ఖర్చులతో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే... అధికారంలో ఉండగా ఇంకెంత చేయగలనో ఆలోచించాలని అన్నారు. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో తీసుకున్న నిర్ణయం తన జీవితాన్నే మార్చేసిందని చెప్పారు. మంగళగిరిలో నాల్గో రోజు 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమం చేపట్టారు. పేదలకు మంత్రి నారా లోకేష్ శాశ్వత ఇంటి పట్టాలు అందజేస్తున్నారు. రత్నాల చెరువుకు చెందిన 600 మందికి, తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి నారా లోకేష్ పంపిణీ చేశారు.
వచ్చే వారం నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, రెండేళ్లలో ఇంటి పట్టా అమ్ముకునే హక్కు కూడా వస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు మధ్యాహ్నం మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో తాడేపల్లి మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. నేడు మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. దశాబ్దాల కల అయిన శాశ్వత ఇంటి పట్టాలు అందించాలని ఇక్కడి ప్రజలు కోరారు. ఏడాదిలోగా బట్టలు పెట్టి మొదటి దశ ఇంటి పట్టాలు ఇస్తానని చెప్పా. 11 నెలల్లో హామీని నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చా. గతంలో ఇంటి పట్టాల కోసం చెప్పులరిగేలా తిరిగారు. జిరాక్స్ లకు, అర్జీలకే వేలరూపాయలు ఖర్చు చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో యుద్ధప్రాతిపదికన కొలతలు తీశాం. ఆ వివరాలన్నీ వచ్చిన వెంటనే కేబినెట్ లో చర్చించి పాలసీ తీసుకువచ్చాం. వచ్చే వారం నుంచి ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఒక్క రూపాయి ఖర్చుపెట్టకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రెండేళ్లలో పట్టాను అమ్ముకునే హక్కు కూడా మీకు వస్తుంది. దయచేసి ఎవరూ అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మన ప్రాంతం అద్భుతంగా అభివృద్ధి చెందుతుంది. అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. మీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తా.మంగళగిరి ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి. రెండో కేబినెట్ మీటింగ్ లోనే ఇది క్లియర్ అయింది. ఈ నెల 13వ తేదీన ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరుగుతుంది. ఏడాదిలోగా పూర్తి చేస్తాం. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, భూగర్భ కరెంట్ అందిస్తాం. లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. పార్క్ లు, చెరువులు అభివృద్ధి చేస్తాం. పిల్లలు ఆడుకునేందుకు క్రికెట్ టర్ఫ్ లు, బాస్కెట్ బాల్ కోర్టులు ఏర్పాటు చేస్తాం... అని లోకేశ్ వివరించారు.

# అభివృద్ధి..వారసత్వం లక్ష్యంగా పయనం




వారణాసి,ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్:
భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని ప్రధాని మోడీ అన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ప్రతిపక్షాలపై విరుచుకు పడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. పులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. ఇదిలావుంటే వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఇది ప్రధాని మోదీ దృష్టికి చేరడంతో ఆయన ఆరా తీశారు. శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోదీ వారణాసిలో పర్యటించిన సందర్భంగా ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజనల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంతమంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తు జరిపిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

## తమిళనాడులో బీజేపీ-అన్నాడీఎంకే పొత్తు ప్రకటించిన అమిత్ షా

**(మొదటి పేజీ తరువాయి)**
అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో కలిసి చెన్నైలో అమిత్ షా విలేకరుల సమావేశం నిర్వహించారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిగా ఏర్పడి లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విషయాన్నిఆయన గుర్తు చేశారు.ఈ పొత్తు కోసం అన్నాడీఎంకే ఎలాంటి షరతులు, డిమాండ్లు పెట్టలేదని అమిత్ షా తెలిపారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో బీజేపీ జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు. ఈ పొత్తు రెండు పార్టీలకు లాభదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు. సీట్ల కేటాయింపు వంటి అంశాలను త్వరలో నిర్ణయిస్తామని వెల్లడించారు. స్టాలిన్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని, ప్రజల దృష్టిని మరల్చేందుకు సనాతన ధర్మం, త్రిభాషా విధానం వంటి అంశాలను తెరపైకి తెస్తోందని అమిత్ షా విమర్శించారు.

**ఇది ఆహ్వానించదగ్గ పరిణామం అన్న పవన్ కల్యాణ్**
తమిళనాడు రాజకీయాల్లో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, అన్నాడీఎంకే పార్టీల మధ్య పొత్తు కుదిరింది. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. బీజేపీ-అన్నాడీఎంకే కూటమికి శుభాకాంక్షలు అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. తమిళనాడులో బీజేపీ, అన్నాడీఎంకే కలిసి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకోవడం ఆహ్వానించదగిన పరిణామం అని అభివర్ణించారు. కూటమి తరపున సీఎం అభ్యర్థిగా పళనిస్వామి పేరు ప్రకటించారని, తద్వారా పాలనాపరమైన అనుభవం ఉన్నవారికి బాధ్యతలు అప్పగిస్తామని తమిళనాడు ప్రజలకు కూటమి తెలియజేసిందని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ సందర్భంగా పళనిస్వామికి అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఎన్డీయే పాలనా విధానాల ద్వారా రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమవుతుందని, తమిళనాడు రాష్ట్రానికి ఎన్డీయే కూటమి ద్వారా కచ్చితంగా మేలు చేకూరుతుందని స్పష్టం చేశారు.

## నేడు ఎపి ఇంటర్ ఫలితాల ప్రకటన

**అధికారిక వెబ్‌సైట్..వాట్సాప్‌లో వెల్లడి**

**ఫలితాలపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లోకేశ్**

అమరావతిఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్: ఏపీలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామన్నారు. విద్యార్థుల తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చునని తెలిపారు. మన మిత్ర వాట్స్ యాప్ నంబర్‌కు 9552300009లో కూడా ఫలితాలు తెలుసుకోవచ్చునని చెప్పారు. అందరికి మంచి ఫలితాలు రావాలని కోరుకుంటూ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు చెప్పారు. కాగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి1న ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు.మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఇప్పటికే ఇంటర్ పరీక్షల మూల్యాంకనం వేగంగా కొనసాంది. ఏప్రిల్ 6 నాటికి మూల్యాంకనం పూర్తి చేశారు. ఆ తర్వాత ఫలితాలను కంప్యూటరీకరణ చేసేందుకు 5-6 రోజుల సమయం పట్టింది. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాషపై పరీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యార్థులకు రోజు మార్చి రోజు పరీక్షలు జరిగాయి. ఈ క్రమంలో అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 1,535 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10.58 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు- చేసి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. పరీక్షా కేంద్రాలను 'నో మొబైల్ జోన్'గా ప్రకటించారు. ఈ సంవత్సరం -టెన్త్, ఇంటర్ హాల్‌టికెట్లు- విడుదల చేసినట్టుగానే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫలితాలు కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవచ్చు. ఇకపోతే తెలంగాణలో ఇంటర్ పరీక్షలు మార్చి 5న మొదలై 25వ తేదీతో ముగిసాయి. ప్రస్తుతం మూల్యాంకన ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఏప్రిల్ చివరి వారంలో ఫలితాలు విడుదల చేయనున్నట్లు- తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారిక వర్గాల సమాచారం.

## గోరంట్ల మాధవ్‌కు 14 రోజుల రిమాండ్...

అమరావతిఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్:
మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్‌ను పోలీసులు ఇవాళ గుంటూరు మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు మాధవ్ కు ఈ నెల 24 వరకు రిమాండ్ విధించింది. 14 రోజుల రిమాండ్ నేపథ్యంలో ఆయనను పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై ఆయనను అరెస్టు చేశారు. మాధవ్‌తో పాటు మరో ఐదుగురు నిందితులకు కూడా కోర్టు రిమాండ్ విధించింది.వివరాల్లోకి వెళితే... వైఎస్ భారతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలిస్తుండగా, మాధవ్ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. గుంటూరులోని చుట్టుగుంట జంక్షన్ వద్ద తన కారును అడ్డుగా ఉంచి, కిరణ్‌కుమార్‌పై దాడికి యత్నించారు. ఈ ఘటనలో ఆయన పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు తెలిపారు.గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం, పోలీసులు మాధవ్‌ను ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు. మాధవ్ తరపున వాదించిన న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రిమాండ్‌ను తిరస్కరించాలని కోరారు, కానీ కోర్టు ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది.కోర్టు ఆవరణలో కూడా మాధవ్ దురుసుగా ప్రవర్తించారని సమాచారం. పోలీసులు కోర్టుకు తీసుకువచ్చిన సమయంలో ఆయన మీడియా ముందుకు వచ్చేందుకు నిరాకరించారు. ఎంపీగా పనిచేసిన నన్ను మీడియా ముందుకు తీసుకువస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

## తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

**జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు**




హైదరాబాద్,ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు ఏప్రిల్ 15 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు.

# ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

## హౌసింగ్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా



**నంద్యాల ప్రతినిధి, ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్:-**
జిల్లాలో మే నెలాఖరికి కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఇళ నిర్మాణాలలో జిల్లా ప్రగతి రాష్ట్రంలో దిగువ స్థానంలో ఉందని మే నెలాఖరికి కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాన్ని సాధించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కేటాయించిన 9,432 గ్రహాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 2,500 ఇండ్లు మాత్రమే పూర్తి చేశారని.. ఇంకా 6,932 గృహాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు గృహ నిర్మాణాల ప్రగతిలో ముందంజలో ఉండగా నంద్యాల జిల్లా దిగువ స్థానంలో ఉండడానికి కారణాలు ఏమిటి అని కలెక్టర్ హౌసింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. పంట కోతలు పూర్తి అయ్యాయని ప్రస్తుత పరిస్థితులు గృహ నిర్మాణాలకు అనుకూలమైన సమయమని సంబంధిత లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ రోజువారీ కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ అమెనిటీ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల రూరల్, అర్బన్, ఆత్మకూరు అర్బన్, ఆళ్లగడ్డ అర్బన్, డోన్ అర్బన్, వెలుగోడు, నందికొట్కూరు, గోస్పాడు, పాములపాడు, కోవెలకుంట్ల తదితర 14 మండలాలు 20% కన్నా తక్కువ ప్రగతి సాధించారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర యావరేజ్ కన్నా జిల్లా పనితీరు బాగుండాలన్న దృక్పథం అధికారుల్లో ఉండాలన్నారు. ఇకనుండి ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై భౌతిక సమావేశాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కేటాయించిన రోజు వారి లక్ష్యంలో పేర్ల వారీగా లబ్ధిదారుల వివరాలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని కూడా వివరించి గృహాలు నిర్మించు కొనేందుకు ప్రోత్సహించాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు.

## ఉత్పాదన, సేవా రంగాల్లోని 24 యూనిట్లకు

# మొత్తం 1.67 కోట్ల విలువైన రాయితీ

**పరిశ్రమలకు ఇచ్చిన భూములు వినియోగంలోకి రావాలి**

**జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయండి**

**ఒక జిల్లా ఒక ఉత్పత్తి పై దృష్టి సారించండి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల ప్రతినిధి, ఏప్రిల్, 11, రిపబ్లిక్ న్యూస్ :-**
ఉపాధి అవకాశాలు కల్పించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం జవహర్ బాబు, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఎల్డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు పెట్టుబడి రాయితీ, పావలవడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్, తదితర రాయితీల క్రింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 24 యూనిట్లకు మొత్తం 1.67 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహ నిమిత్తం గత త్రైమాసిక కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోసం 10 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 8 పరిశ్రమలకు అనుమతులు మంజూరు అయ్యాయని వాటిలో 2 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ పరిశ్రమల కోసం కేటాయించిన భూములను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు సెకండరీ సెక్టార్ పరంగా 18 శాతం పురోగతి ఉందని వాటిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మీదుగా 9 నేషనల్ హైవేస్ వెళ్తున్న నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న సాధ్య సాధ్యాలపై దృష్టి సారించాలన్నారు. బనగానపల్లె, ఔకు ప్రాంతాల్లో క్లస్టర్లు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. జిల్లాలో సుమారుగా 25 వేల టన్నుల మిరప పండిస్తున్న నేపథ్యంలో వాటిని శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పిఎం విశ్వకర్మ యోజన క్రింద రెండవ దశ నుండి మూడవ దశకు 4,898 దరఖాస్తులు పంపడం జరిగిందని, అదేవిధంగా మూడో దశలో 3,148 దరఖాస్తులు ఉన్నాయని వాటిని త్వరితగతిన వెరిఫై చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. "వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్" (ఒక జిల్లా ఒక ఉత్పత్తి) లో భాగంగా ఆళ్లగడ్డలో తయారవుతున్న చేతి పనిముట్లు, నందివర్గం టవల్స్ కు ఎక్కువ ప్రాముఖ్యత ఉందని వాటిని పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## కర్నూలు విద్యాశాఖ

# ఏడీపై సస్పెన్షన్ వేటు




**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 11 (రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులుపై సస్పెన్షన్ వేటు పడింది. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఇటీవల ఆయనపై పలు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టిన కడప ఆర్జేడీ నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. దీంతో తాజాగా ఆయనను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో

# పూలే జయంతి వేడుకలు

**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 11(రిపబ్లిక్ న్యూస్)**
బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సంధర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.
ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ మాట్లాడుతూ .మహాత్మా జ్యోతిబా పూలే సంఘసంస్కర్త, కుల వ్యతిరేక కార్యకర్త, ఆలోచనాపరుడు , విద్య మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం మరియు కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారన్నారు. సామాజిక సమానత్వం, మహిళా సాధికారత మరియు విద్యను పెంపొందించడం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ ఎస్సైలు, ఎఆర్ పోలీసులు పాల్గొన్నారు

# పాములపాడులో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా

# ముస్లిం సంఘాల, వామపక్ష పార్టీల నాయకుల ర్యాలీ.

## అనంతరం పాములపాడు తహసిల్దార్ జి.సుభద్రమ్మకు వినతి పత్రం సమర్పణ.




**పాములపాడు ఏప్రిల్ 11 రిపబ్లిక్ న్యూస్:-**
మండల కేంద్రమైన పాములపాడులో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల నాయకులతో, ప్రజా సంఘాల నాయకులతో కలిసి భారీ ర్యాలీ, తహసిల్దార్- జి. సుభద్రమ్మకు వినతిపత్రం సమర్పించారు. మొదట బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పాములపాడులో ఈరోజు మధ్యాహ్నం జుమ్మా నమాజ్ తర్వాత(అంటే మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల మధ్యన) మజీద్ ఏ హాస్మి ఇమామ్ షేక్.ఆరిఫ్ భాష, జామియా మసీద్ ఇమామ్ సుభాన్ మౌలానా ల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు టీ.షాజహాన్ బేగం,సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్, సిపిఎం పార్టీ నాయకులు డి.స్వామన్న, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న వైఎస్ఆర్సిపి నాయకులు %ఽ% మండల కో అప్టేట్ మెంబర్ సయ్యద్.ముర్తుజాఅలి, నూర్ భాషా సంఘం నాయకులు, అన్ని ప్రజా సంఘాల నాయకులతో కలిసి హాస్మి మసీదు నుండి వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని, మోడీ హటావో- దేశ్ బచావో , మోడీ డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తూ ర్యాలీగా బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నిలబడి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని కాపాడాలని నినాదాలు చేసి అక్కడినుండి మళ్లీ ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టి, తహసిల్దార్ జి.సుభద్రమ్మకు, ఆర్ఐ-డి.ఖాజాబీ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొండిగా నిరుద్వందంగా బిల్లును ప్రవేశపెట్టి తమ యొక్క మంద బలం తో బిల్లులు పాస్ చేయించుకుంటే ప్రజానీకం ముస్లిం మైనారిటీలతోపాటు న్యాయ నిపుణులు ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు ప్రజాతంత్ర ఉద్యమకారులు వివిధ రకాల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలతోపాటు రాజ్యాంగ నిపుణులు తీవ్రంగా ఖండిస్తున్నప్పటికీ ,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ యొక్క కనుసన్నలలో బిల్లును తెచ్చిందని తద్వారా ముస్లిం మైనార్టీల ఆస్తూలను కబ్జా చేసుకోవాలని ఆర్ఎస్ఎస్ తమ చేతిలోకి ఈ ఆస్తులను తీసుకోవాలని కుట్ర, కుతంత్రాలలో భాగం అని వారు తెలియజేశారు. మన రాష్ట్రంలోని జనసేన, తెలుగుదేశం, బిజెపి కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా మద్దతు ఇవ్వడం క్షమించరాని నేరమని వారు తెలియజేశారు. ఇప్పటికైనా జనసేన,తెలుగుదేశం పార్టీ లలో ఉండే ముస్లిం మైనారిటీ నాయకులుగా చలామణి అవుతున్న వారు తక్షణమే తమ అధినేత పైన వత్తిడి తీసుకొని వచ్చి, పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ, తమిళనాడు రాష్ట్రలో స్టాలిన్, కేరళ రాష్ట్రంలో పీనరాయి విజయన్ లు బిల్లును అనుమతించేది లేదని అక్కడి ప్రభుత్వాలు తీర్మానం చేశాయని అలాగే ఆ రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలో కూడా చంద్రబాబు నాయుడుపైన ఒత్తిడి తెచ్చి అసెంబ్లీలో ఈ బిల్లు అమలు చేసేదే లేదని ఏకగ్రీవంగా తీర్మానం చేసే విధంగా ఒత్తిడి తీసుకురావాలని ,అలా చేత కానప్పుడు మైనార్టీ నాయకులందరూ కూడా ముకమ్మడిగా తమ రాజకీయ పదవులకు, పార్టీ పదవులకు రాజీనామాలు చేసి మాతోపాటు ప్రజా ఉద్యమాలలో పాల్గొని, ఈ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అలా చేయకపోతే మిమ్ములను కూడా ఆర్ఎస్ఎస్, బిజెపితో పాటు చూడవలసి వస్తుందని బిల్లుకు మద్దతు ఇచ్చిన పార్టీలను వారు హెచ్చరించారు. గుడ్డిగా మద్దతు తెలియజేస్తున్న ప్రజానీకాన్ని కూడా, ఓటర్లను కూడా కేంద్ర, రాష్ట్ర పాలకుల కుట్రలను, కుతంత్రాలను ఇప్పటికైనా తెలుసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలు పోరాటాలు ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ ఉద్యమాలలో భారత దేశంలో ఉండే యావత్తు యువతి.యువకులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు లౌకికవాదులు, ప్రజాతంత్ర వాదులు, బహుజనులందరూ తమతో కలిసి రావాలని ఆ రకంగా మద్దతు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం క్రైస్తవులకు, ముస్లింలకు వ్యతిరేకంగా చేస్తున్న చట్టాలను మూకుమ్మడిగా అడ్డుకోవాలని అప్పుడైతేనే ఈ ప్రభుత్వానికి ముక్కుకు ముకుతాడు వేసిన వారు అవుతామని తక్షణమే ప్రజలందరూ ఐక్యమై ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సిఐటియు మండల కార్యదర్శి మేకల.రాజు, హాజీ షేక్.మహబూబ్ బాషా, నూర్ భాషా సంఘం నాయకులు రియాజ్, పి.తారా, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ బషీర్, ఖాజా మొహిద్దీన్, మెకానిక్ వలి మొహమ్మద్ హుస్సేన్ రుద్రవరం హుస్సేన్ భాష, అశ్రఫ్ అలీ, సద్దాం, సయ్యద్ ఖాదర్, సాయి హుస్సేన్, మాబ్బాషా, సయ్యద్. ముర్తుజావలి, షఫీ, చాంద్ భాషా, సయ్యద్ ఖాదర్, ఇంతియాజ్, చికెన్ సెంటర్ మౌలాలి, చికెన్ సెంటర్ మక్బూల్, సైకిల్ షాప్ ముర్తుజావలి, సైఫుల్లా, అజాజ్ అలి, ఆదిల్ భాష, హబీబుల్లా, మౌలాలి, సుభాన్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే 199 వ జయంతి వేడుకలు



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 11 (రిపబ్లిక్ న్యూస్)**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సామాజిక ఉద్యమకారుడు,సంఘ సంస్కర్త, రచయిత, తత్వవేత్త, మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలను జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించరు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు, పలువురు మాట్లాడుతూ.. ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత, ఉద్యమాలకు ఆద్యుడు పూలే అని ప్రశంసించారు.. చదువులతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన మహాత్ముడు అని చెప్పుకొచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే మార్గంలోనే పయనించాలని కోరారు. సమాజంలో కుల వ్యవస్థ నిర్మూలన, స్త్రీ పురుషులకు సమాన హక్కుల కోసం ఎంతగానో పోరాడిన సామాజిక యోధులని గుర్తు చేసుకున్నరు.. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటి చైర్మన్ అమిరిపెల్లి మల్లేశం ఏఎంసి చైర్మన్ లవుడియ రూప్ల నాయక్,బొల్లి స్వామి, దేవి జనార్ధన్, కాడే సూర్యనారాయణ, దేవి రాజలింగు,ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశం గౌడ్, దళిత బహుజన నాయకులు రసమల్ల సత్యం జాడి రాజన్న, గడ్డం లింగారెడ్డి, టి రాంబాబు,మేడ వేణి శ్రీనివాస్, పిట్టల స్వరూపారాణి, యశోద అజయ్, సోగాల తిరుపతి, సుంచు మల్లేశం, కాంపల్లి రాజేశం, ఈ.శ్రీనివాస్, అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ అధ్యక్షుడు దేవి కిషోర్, ఓ శంకరయ్య, కే ఎల్లయ్య,జి కిట్టు, బాబా, వేణు, లావణ్య, అషు, రాజారాం, రఫీ, చిరంజీవి, సుమన్, కుమార్, మల్లేశం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి

# నూతన కమిటి ప్రమాణ స్వీకారం

## హాజరైన ప్రభుత్వ విప్ అడ్లూరి



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్11 (రిపబ్లిక్ న్యూస్)**
పెద్దపల్లిజిల్లా ధర్మారం మండలము లోని ఖిలవనపర్తి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శుక్రవారం రోజున ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొనీ నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు ముందుగా మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..ఖిలవనపర్తి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనందుకు చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ చైర్మన్ మరియు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామనీ, ధర్మారం మండలంలో నన్ను ఎప్పుడూ ఒక బయటి వ్యక్తిలాగా చూడలేదని,ఒక కుటుంబ సభ్యుడుగానే చూసారని,ఒక జడ్పీటీసీ గా ఇక్కడి నుండి గెలిపించి,జడ్పీ చైర్మన్ గా,ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ గా పని చేసి ఈ రోజు ఒక ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్ గా మీ ముందు ఉండటం జరిగిందని,కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన పోలీసులతో బెదిరించిన,డబ్బు ఆశ చూపించిన ఎక్కడ లొంగకుండా కాంగ్రెస్ పార్టీనీ గెలిపించి అధికారంలోకి తీసుకురావడం జరిగిందని,పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని,పార్టీ కొరకు కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని,తాను గెలిచిన ఓడిన ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉన్నానని, ఖిలవనపర్తి ఆలయ అభివృద్ధి విషయంలో ఎటువంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న ప్రభుత్వం తరపున అందిస్తామని,ధర్మారం మండల అభివృద్ధి నా శాయశక్తుల కృషి చేస్తానని,ఆలయ అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి నూతన ఆలయ కమిటి చైర్మన్ సంతోష్ మ ఏఎంసి చైర్మన్ రూప్ల నాయక్ అరిగేల లింగయ్య దేవి జనార్ధన్, కాడే సూర్యనారాయణ, ,ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాజేశం గౌడ్, కొత్త నరసిహులు యశోద అజయ్, సోగాల తిరుపతి,కాంపల్లి రాజేశం,జెల్లా సంపత్ ఆవుల మాల్లయ్య మణి శర్మ ఈ.శ్రీనివాస్,దేవి కిషోర్, ఓ శంకరయ్య, కే ఎల్లయ్య,జి కిట్టు, బాబా, వేణు, లావణ్య, అషు, రఫీ, చిరంజీవి, సుమన్, కుమార్, మల్లేశం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల పాత భవనాలను ఉర్దూ యూనివర్సిటీకి అప్పగించ రాదు -ఎస్ఎఫ్ఐ






**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 11(రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల (ఫర్ మెన్) పాత భవనాలను ఉర్దూ యూనివర్సిటీకి అప్పగించరాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్లస్టర్ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ముందు ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది అనంతరం క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్టర్ వెంకటేశ్వర్లు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప మాట్లాడుతూ ఫర్ మెన్ భవనాలను ఉర్దూ యూనివర్సిటీ కి ఇవ్వాలని ఉన్నత విద్యా అధికారులు ఆదేశాలు ఇవ్వటం సరైనది కాదు అన్నారు ఎందుకంటే కొత్తగా నిర్మించిన రూసా భవనాలు అసంపూర్తిగానే నిర్మాణం చేయబడ్డాయి. వాటిలో సరైన వసతులు లేవు అన్నారు. దానితోపాటు ఈ రూసా భవనాలలో ఫర్ మెన్ మార్చటం ఇప్పుడు ఉన్న పాత భవనాలు ఉర్దూ యూనివర్సిటీకి ఇస్తే రాబోయే విద్యా సంవత్సరంలో ఫర్ మెన్ విద్యార్థులకు హాస్టల్ వసతి ఉండదు. దీని ప్రభావం అడ్మిషన్లపై పడుతుందన్నారు. ఒకే కాంపౌండ్ లో రెండు యూనివర్సిటీలు నిర్వహించటం సరైన వైఖరి కాదు. ఈ విధంగా చేయటం వల్ల యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తినే ప్రమాదం కూడా ఉంది. కావున ఎంతో విద్యా ప్రమాణాలు కలిగిన ఫర్ మెన్ కళాశాల భవనాలను ఉర్దూ యూనివర్సిటీకి అప్పజెప్పడం ఆపేయాలి అన్నారు. అలాగే దీనిద్వారా అనేక విద్యా పరమైన సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం కూడ ఉంటుంది. కాబట్టి తక్షణమే ఫర్ మెన్ డిగ్రీ కళాశాల పాత భవనాలను ఉర్దూ యూనివర్సిటీ అప్పగించాలన్న నిర్ణయాన్ని క్లస్టర్ యూనివర్సిటీ అధికారులు, ఉన్నత విద్యా స్థాయి మండలి అధికారులు ఉపసంహరించుకోవాలి. 2025 -26 ప్రారంభమయ్యే విద్యా సంవత్సరంలో ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కోర్సులలో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఎఐ) గా డిమాండ్ చేయడం చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ జిల్లా సహాయ కార్యదర్శులు అంజి అమర్ జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ నగర నాయకులు పృథ్వీ హరి పి ఎస్ ఎన్ నాయకులు మనోహర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

## మహిళల చదువు అభివృద్ధికై కృషి చేద్దాం :- ఐద్వా




**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 11(రిపబ్లిక్ న్యూస్):** శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా అఖిలభారత ప్రజాతంతా మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో ఆయన ఫోటోకు దండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు
K. అరుణ, N. అలివేలమ్మ మాట్లాడుతూ కులవివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని వారు చెప్పారు. సమాజంలో మహిళల అభివృద్ధి చదువుతూనే సాధ్యమవుతుందని మొదట తన సతీమణిని చదువు నేర్పించి పంతులుగా తీర్చిదిద్దిన ఘనుడు జ్యోతిరావు పూలే అని, సమాజంలో మహిళల అభివృద్ధికి కృషిచేసిన నాయకుడని వారు తెలిపారు. ప్రస్తుతం దేశంలో కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం విధానాల వల్ల రోజురోజుకు మహిళలపై లైంగిక వేధింపులు,అత్యాచారాలు పెరిగిపోయి,వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు, వెనుకబాటు తనానికి వ్యతిరేకంగా పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఓల్డ్ సిటీ కార్యదర్శి బి పద్మ నగర నాయకురాలు వేణి విజయలక్ష్మి రాధా మహేశ్వరి జయమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా సాంఘిక విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి

## జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు

**పాములపాడు , ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్ :**
భారత సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆయన మహారాష్ట్ర పూణేలో 1827 ఏప్రిల్ 11న అట్టడుగు వర్గంలో జన్మించే నాటికి మనువాద ధర్మం నాలుగు పాదాల నడుస్తోంది, కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్న అస్పృశ్యులలాగే సమాజంలో పురుషులకు సమానంగా ఏమాత్రం అవకాశాలు పంచుకునే పరిస్థితి స్త్రీలకు లేదు . ముఖ్యంగా బాలికలు పాఠశాలలకు వెళ్లి చదువుకోవడం తప్పుగా భావించేవారు అటువంటి పరిస్థితులను మార్చాలని పూలే నడుంబిగించారు . మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించడానికి నాటి మనువాద సమాజం జీర్ణించుకోలేకపోయింది. పూలే తండ్రికి ఊళ్లోని వారందరూ ఇంటికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో సొంత తండ్రి అప్పటికే పెళ్లయిన పూలేను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు . మహిళా విద్యను ముందు తన ఇంటి నుంచి ప్రారంభించారు . పూలే నిరక్షరాశులయిన తన భార్య సావిత్రిబాయికి తానే చదువు నేర్పి ఆమెను ఒక



ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దారు . మతం ద్వారా తాము ఎంత మోసానికి గురవుతున్నారో బడుగు వర్గాలకు తెలియ చెప్పడానికి తృతీయ రత్న వంటి నాటకాలు పెక్కు కవితలు రాశారు . ఆయన రాసిన గులాం గిరి వంటి గ్రంథాలు సమకాలీన సమాజపు పోకడలకు అద్దం పట్టాయి. ఎందరికో దిశా నిర్దేశం చేశాయి వితంతువులకు అనాధ మహిళలకు శిశు వులకు శరణాలయాలు స్థాపించారు . పూలే దంపతులు బడుగు వర్గాల విజ్ఞాన వికాసాల కోసం సత్యశోధకు సమాజ్ వంటి సంస్థలు స్థాపించారు. కార్మిక ఉద్యమ పితామహుడైన లోకండే ఆయనకు ప్రధాన అనుచరుడు కార్మికులకే కాక , కర్షకుల ఉన్నతికి కూడా ఎన్నో రచనలు చేశారు . బ్రిటిష్ ప్రభుత్వ దృష్టిని వారి సమస్యల వైపునకు మళ్ళించడంలో పూలే విజయం సాధించారు. పూలేను బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక ఆదర్శమూర్తిగా గురువుగా పేర్కొని గౌరవించేవారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్కమ్ టాక్స్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్ , జనసేన నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి నల్లమల రవికుమార్ ,ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ డి నాగన్న, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు అంకన్న, అబ్రహం , జాతీయ బీసీల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ బిజెపి మండల అధ్యక్షులు మురళి ,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామోదర్ రెడ్డి ,మండల బీసీ నాయకులు గట్టు శివశంకర్ నాగరాజు, సాయి, జనసేన మండల నాయకులు బత్తుల కిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు

# సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే

## నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ



**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 11(రిపబ్లిక్ న్యూస్):** అంటరానితనానికి, కుల వివక్షకు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించిన బహుజన తత్వవేత్త, సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే అని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ అన్నారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా శ్రీ జ్యోతిబాయి పూలే జయంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ యన్.చిన్నరాముడు, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామక్రిష్ణ, స్వర్ణలత, సూరరంగ బాబు, డియస్ఓ కృష్ణ మేనేజర్, టిడ్కో అధికారి పెంచలయ్య, సిబ్బంది రాజు, రామంజీ, మోహన్, నాగరాజు, షబాన, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 199 జయంతి వేడుకలు

## సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే -జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





**కర్నూలు, ప్రతినిధి ఏప్రిల్ 11 (రిపబ్లిక్ న్యూస్)**
బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు..శుక్రవారం కర్నూలు నగరంలోని బిర్లా గేట్ వద్ద మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు , పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, బిసి, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, తదితరులు పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1827 సంవత్సరం ఏప్రిల్ 11 వ తేదీ పుట్టిన మహాత్మా జ్యోతిబా పూలే గురించి దాదాపు 198 సంవత్సరాల తర్వాత మాట్లాడుకుంటూ, ఈరోజు ఆయన జయంతి ని ఒక పండగలాగా రాష్ట్రమంతా, దేశమంతా చేసుకుంటున్నామంటే, ఖచ్చితంగా ఆయన సమాజానికి ఎంతో మేలు చేసిన వ్యక్తి అని, అలాంటి మహనీయుని ఆశయాలకు అందరు పునరంకితం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.
మహారాష్ట్రలో సతారా జిల్లాలో పుట్టిన ఆయన చిన్నతనంలో తల్లిని కోల్పోవడం, ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించకపోలేని స్థితిలో ఇతరులు సహాయం చేస్తే విద్యను అభ్యసించారన్నారు..200 సంవత్సరాల క్రితం సమాజంలో అప్పుడున్నటువంటి అస్పృశ్యత, అంటరానితనం, వర్ణ వ్యవస్థ లు, స్త్రీ విద్యను అవకాశం లేని పరిస్థితుల్లో సమాజంలో ఒక విప్లవాని తీసుకొని వచ్చారన్నారు..ఇండియాలో సోషల్ రెవల్యూషన్ తీసుకొచ్చిన మొట్టమొదటి వ్యక్తి కాబట్టే, జ్యోతిబా పూలే ను సోషల్ రిఫార్మ్ రెవల్యూషన్ కి ఫాదర్ గా మనమందరం కొనియాడతామన్నారు... .. కొన్ని కొన్ని వర్గాలకు కొందరికి మాత్రమే ప్రయోజనాలు ఉండడం, మిగతా వారంతా వెనుకబడిపోవడం అటువంటి వాటికి ఆయన కారణాలను వెతికారన్నారు..విద్య, అవగాహన లేకపోవడం అలాగే స్త్రీలు బాగా వెనకబడి ఉండడం ఆయన గమనించి వీటి మీద ప్రత్యేక దృష్టి సారించారన్నారు.. విద్య, స్త్రీ విద్య, బాల్య వివాహాల నిర్మూలన కోసం ఆయన ఎంచుకున్న పంథా మొట్టమొదట ఒక సత్యశోధక్ సమాజాన్ని తీసుకొని సత్యాన్ని మీరు శోధించండి సత్యం ఏంటో తెలుసుకోండి సాంఘిక దురాచారాలకు దూరంగా ఉండండి అన్న ఆసందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లారన్నారు..సత్యశోధక్ సమాజాన్ని స్థాపించడం, దీనబంధు అంటే పేదలు ఎలా ఉండాలి? ఏం నేర్చుకోవాలి, ఎలా పైకి రావాలి, అని చైతన్యం తెచ్చారన్నారు..
ఆయన సతీమణి సావిత్రి బాయి పూలే చదువు చెప్పించారన్నారు.. ఒక స్కూల్ స్థాపించారని, అది దేశంలోనే బాలికలకు సంబంధించి అతిపెద్ద రెండో స్కూల్ అన్నారు.. అటువంటి స్కూల్ ని ఆయన స్థాపించి స్త్రీ విద్యకు పాటుపడ్డారన్నారు. ఆయన ఎంచుకున్న పంథా వల్ల తర్వాత చాలామందికి ఆదర్శప్రాయులు అయ్యారన్నారు.. ,వారి అడుగుజాడల్లో నడుస్తూ వెనుకబడి ఉన్న వారి అభివృద్ధికి మనం కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.. ఎస్సీ, ఎస్టీ , బీసీ ల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయా కార్పొరేషన్ లకు బడ్జెట్ ఏర్పాటు చేయడం, స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తోందన్నారు.. బిసిలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి, కాపు కార్పొరేషన్ ల ద్వారా స్వయం ఉపాధి పథకముల కింద 508 మందికి రూ. 11.77 కోట్లు ఇవ్వడం జరుగుతోందన్నారు..
జ్యోతిబా పూలే గారి విగ్రహం వద్దే సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటుకు, అలాగే మెట్లు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.. అంబేద్కర్ భవన్ కి సంబంధించి 20 లక్షల రూపాయలు శాంక్షన్ చేయడం జరిగిందని, టెండర్లు కూడా అయిపోయి పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయన్నారు.. ఎస్సీ వసతి గృహాలకు 7 కోట్ల రూపాయలు వచ్చిందని, బీసీ వసతి గృహాల మరమ్మతులకు డి ఎం ఎఫ్ నుండి 50 లక్షల రూపాయల వరకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఎంపీ గారి నిధుల నుండి కోటి రూపాయలు ఇవ్వడం జరిగిందని అది గవర్నమెంట్ ఆఫ్ ఇండియా లో పెండింగ్ లో ఉందని కలెక్టర్ వివరించారు..
కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే కుల వివక్షను రూపుమాపాలనే లక్ష్యంతో పనిచేశారన్నారు. కుల, లింగ విభేదాలు లేకుండా అన్ని రంగాలు సమానంగా ఉండేలా పోరాడిన వ్యక్తి ఆయన అన్నారు. విద్యకు ప్రోత్సాహం ఇచ్చి, అందరిని చైతన్యవంతులు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ లు అందరినీ ఒక స్థాయికి తీసుకొచ్చిన వ్యక్తి పూలే గారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ జ్యోతిబా పూలే నా గురువు అని చెప్పుకున్నాడు అన్నారు. బీసీల కులగణన పారదర్శకంగా జరగబోతుందని ఎంపీ అన్నారు. కులగణన జరగడం వల్ల బీసీలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తారన్నారు. మన ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ఆశయాలను తూచా తప్పకుండా పాటిస్తుందన్నారు. మన ప్రభుత్వంలో బీసీ కులానికి చెందిన నన్ను పార్లమెంటుకు ఎంపిక చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో కర్నూలు జిల్లాలో తాత్కాలికంగా మూసిన బిసి హాస్టల్లను వచ్చే విద్యా సంవత్సరానికి పునర్ ప్రారంభిస్తున్నందుకు ప్రభుత్వానికి మనం కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నారు. విజయనగరం,కర్నూలు జిల్లాలో బీసీ భవనం నిర్మాణానికి 2.5 కోట్ల రూపాయల చొప్పున మంజూరు చేసిందన్నారు. ఈ కల సాధ్యమైనంత త్వరగా నెరవేరుతుందన్నారు, బిర్లా గేట్ సర్కిల్లో త్వరలోనే సావిత్రిబాపూలే విగ్రహాలను ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. బీసీ వర్గాల కులాల వారందరూ ఖచ్చితంగా వారి పిల్లలను బాగా చదివించుకోవాలని తెలియజేశారు. బీసీలు విద్యాపరంగా చూసుకుంటే కర్నూలు పార్లమెంటు లో చాలా వెనకబడి ఉన్నారన్నారు. కావున బీసీలు అందరూ బాగా చదువుకొని, విద్యాపరంగా, ఆర్థికపరంగా, రాజకీయపరంగా అన్ని రంగాల్లో ముందంజ ఉండాలని ఎంపీ గారు పిలుపునిచ్చారు. బీసీ కులాల వారి అభివృద్ధి కోసం మన ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు..
పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే మహారాష్ట్రలోని సతార జిల్లాలో మాల్య అనే అతిపెద్ద కుటుంబంలో జన్మించడం జరిగిందన్నారు.. ఆయనకి 9 నెలలున్నప్పుడే తల్లి చనిపోవడం జరిగిందని, ఆయన ఆర్థిక సమస్యల వల్ల చదువును కూడా చదువుకోలేకపోయారన్నారు... కానీ ఆయన తెలివితేటలను గుర్తించి పక్కన వారు ఆయనకు చదువు చెప్పించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ముఖ్యంగా ఆ రోజులలో సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ, బాల్య వివాహాలు, నిరక్షరాస్యత ఎక్కువగా ఉండేదన్నారు.. వాటి రూపకల్పనకు ఆయన ఎన్నో కార్యక్రమాలు తీసుకొచ్చారన్నారు... ఆయన బాల్యవివాహాలను నిర్మూలించి, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడం జరిగిందన్నారు...అంతేకాకుండా చదువు ఎంతో ముఖ్యమని చెప్పి ఆయన ఒక సంస్థను స్థాపించి దేశంలోనే మొట్టమొదటి తన భార్య సావిత్రిబాయి పూలే గారికి చదువు చెప్పించి మొట్టమొదటి దేశంలోనే స్త్రీల కోసం, మహిళల కోసం పాఠశాలను ఏర్పాటు చేసి దాంట్లోనే ప్రథమ ఉపాధ్యాయురాలుగా ఆమెని కొనసాగించడం జరిగిందన్నారు... సావిత్రిబాయి పూలే గారు కూడా భర్తకు తగిన సహాయ సహకారాలు అందిస్తూ ఎన్నో రకాలుగా వాళ్ళు పోరాటం చేయడం జరిగిందన్నారు.. ఈరోజు ఎక్కడికి వెళ్ళినా విశ్వవిద్యాలయాలు అన్నిటికీ జ్యోతిరావు పూలే గారి పేరే కొనసాగించడం జరుగుతోందన్నారు... అంతేకాకుండా ముఖ్యంగా స్త్రీలు, మహిళలు చదువుకుంటేనే ఆ సమాజం బాగుపడుతుందనే ఉద్దేశంతోనే స్త్రీలకి మొట్టమొదటగా చదువు ను ప్రారంభించింది జ్యోతిరావు పూలే గారన్నారు.. మహానుభావుడైన డా. బి.ఆర్ అంబేద్కర్ గారు కూడా జ్యోతిరావు పూలే గారే నాకు స్ఫూర్తిదాత ఆయనే ఆశయాలనే కొనసాగిస్తున్నానంటే జ్యోతిరావు పూలే గారు ఎంత గొప్ప వ్యక్తి అనేది అర్థమవుతుంది అన్నారు. జ్యోతిరావు పూలే మహనీయుడు, చిరస్మరణీయుడు, మానవతావాది అన్నారు.. అటువంటి గొప్ప వారి అడుగుజాడల్లో మనమందరం నడవాలని తెలియజేశారు..
మన ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బీసీలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు.. నామినేటెడ్ పోస్టులలో బీసీలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు... బీసీల కోసం ఆదరణ పథకాన్ని తీసుకొని వచ్చి ప్రతి ఒక్క కులానికి ఆదరణ పథకం ద్వారా ఏ కులస్తులయితే వాళ్లకి ఆ పనిముట్లను అందజేసిన ఘనత టిడిపి ప్రభుత్వానిది అన్నారు... అదే విధంగా మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యేందుకు గాను 2024 డిసెంబర్ లో గొల్లపూడిలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారన్నారు.. 100 మందికి ఉచితంగా ఐఏఎస్ కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.. త్వరలోనే ఈ నెలలోనే మెగా డిఎస్సి నోటిఫికేషన్ కూడా రాబోతుందని దానికి కూడా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.. ఈ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తోందన్నారు..బీసీలను ఆర్థికంగా పైకి తీసుకురావాలని, మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని, వారి జీవితాలు బాగుపడాలనే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.
అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నుండి బిసి, ఆర్థికంగా వెనుకబడిన వారికి, కాపు కార్పొరేషన్ ల ద్వారా స్వయం ఉపాధి పథకముల కింద 508 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన 11 కోట్ల 77 లక్షల 50 వేల రూపాయల చెక్కును కలెక్టర్, కర్నూలు ఎంపీ, పాణ్యం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు..
కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కే.ఈ.ప్రభాకర్, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయ్, బోయ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మురళి,బోయ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, కురువ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరాముడు, నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్, వాల్మీకి సంఘం స్టేట్ డైరెక్టర్ సంజమ్మ, రాష్ట్ర దళిత సమైక్య అధ్యక్షుడు శ్రీనివాసులు, వివిధ సంఘాల బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కొరకు
# కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి - జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల క్రైం, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అధ్యక్షతన జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జ్యోతిరావు గోవిందరావు పూలే భారతీయ సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త, కుల వ్యతిరేక సంఘసంస్కర్త, రచయిత అని అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కొరకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. జ్యోతిరావు గోవిందరావు పూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో 11 ఏప్రిల్, 1827 జన్మించారు. అతని తండ్రి గోవిందరావు పూనాలో కూరగాయలు వ్యాపారి. జ్యోతిరావు తండ్రి, మేనమామలు పూల వ్యాపారులుగా పని చేయడంతో ఆ కుటుంబానికి %-%పూలే' అనే పేరు వచ్చింది. జ్యోతిరావుకు తొమ్మిది నెలల వయస్సు ఉన్నప్పుడే తల్లి మరణించింది. జ్యోతిరావు ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చిన్నతనంలోనే చదువు ఆపేయాల్సి వచ్చింది. కుటుంబ పొలంలో పని చేస్తూ తండ్రికి సహాయం చేయడం ప్రారంభించాడు. 1841లో, జ్యోతిరావు పూనాలోని స్కాటిష్ మిషన్స్ హైస్కూల్‌లో అడ్మిషన్ పొందాడు. 1847లో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశాడు. కేవలం పదమూడేళ్ల వయసులో, జ్యోతిరావుకు సావిత్రీబాయితో వివాహం జరిగింది.

జ్యోతిరావు 'జ్యోతిబా' గోవిందరావు పూలే పందొమ్మిదవ శతాబ్దపు భారతదేశానికి చెందిన ప్రముఖ సంఘ



సంస్కర్త. భారతదేశంలో ఉన్న కుల-నిబంధనలకు వ్యతిరేకంగా ఉద్యమానికి నాయకత్వం వహించాడు. రైతులు, ఇతర తక్కువ కులాల ప్రజల హక్కుల కోసం పోరాడాడు. మహాత్మా జ్యోతిబా పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకుడు, తన జీవితాంతం బాలికల విద్య కోసం పోరాడారు. అభాగ్యులైన పిల్లల కోసం అనాథాశ్రమాన్ని ప్రారంభించారు.

### మహిళా విద్య దిశగా ప్రయత్నాలు

%మహిళలు, బాలికలకు విద్యాహక్కు కల్పించాలనే జ్యోతిబా తపనకు ఆయన భార్య సావిత్రిబాయి పూలే మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో అక్షరాస్యులైన కొద్దిమంది మహిళల్లో ఒకరైన సావిత్రీబాయికి ఆమె భర్త జ్యోతిరావు ద్వారా చదవడం, రాయడం నేర్పించారు. 1851లో జ్యోతిబా బాలికల పాఠశాలను స్థాపించి పాఠశాలలో బాలికలకు చదువు చెప్పమని తన భార్యను కోరాడు. వితంతువుల దయనీయ పరిస్థితులను గ్రహించి, యువ వితంతువుల కోసం ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పనిచేశారు.



పిల్లలు కొన్నిసార్లు చాలా పెద్ద వయసులో ఉన్న పురుషులతో వివాహం చేసుకున్నారు. ఈ మహిళలు యుక్తవయస్సు రాకముందే తరచుగా వితంతువులుగా మారారు. కుటుంబ మద్దతు లేకుండా పోయారు. జ్యోతిబా వారి దుస్థితిని చూసి బాధపడ్డాడు, సమాజం యొక్క క్రూరమైన చేతుల్లో నశించకుండా 1854లో అనాథాశ్రమాన్ని స్థాపించారు. అతను సామాజిక కార్యకర్త, సంస్కర్తగానే కాకుండా వ్యాపారవేత్త కూడా. అతను మునిసిపల్ కార్పొరేషన్‌కు సాగుదారు. కాంట్రాక్టర్ కూడా పనిచేశారు. అతను 1876 - 1883 మధ్య పూనా మునిసిపాలిటీకి కమీషనర్‌గా పనిచేశాడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, కవిత, సాయుధ బలగాలు, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# నవజీవన్ బదిరుల పాఠశాలకు
# క్రీడా పరికరాల పంపిణీ

## ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం, నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం సంయుక్త నిర్వహణలో

**సౌజన్యం:** విశ్రాంత అధ్యాపకులు బి. జనార్దన్ రెడ్డి



నవ జీవన్ ప్రత్యేక పాఠశాల బాలలకు క్రీడా పరికరాలు అందజేసిన ఐఎంఏ నంద్యాల వైద్యులు.

**నంద్యాల ఏప్రిల్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం నిర్వహణలో శుక్రవారం స్థానిక అయ్యలూరు మెట్ట దగ్గర ఉన్న నవజీవన్ బదిరుల పాఠశాలకు విశ్రాంత లెక్చరర్ జనార్ధన రెడ్డి సౌజన్యంతో క్రీడా పరికరాలు పంపిణీ చేయడం జరిగింది. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ కల్పన, డాక్టర్ రవికాంత్ రెడ్డి, జనార్ధన రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని బదిర బాలలకు వివిధ ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలకు వివిధ సేవా కార్యక్రమాలను, సహాయ సహకారాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. డాక్టర్ కల్పన మాట్లాడుతూ నంద్యాల మహిళా విభాగం ద్వారా ఈ పాఠశాలకు తమ వంతు సేవలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా బదిర బాలికల నృత్య ప్రదర్శన ఆహుతులను అలరింప చేసింది. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ కల్పన, డాక్టర్ రవికాంత్ రెడ్డి, దాత జనార్ధన రెడ్డిలతో పాటు నవజీవన్ పాఠశాల నిర్వాహకు సిస్టర్ జ్యోతి, ప్రిన్సిపల్ పద్మావతి, ఏవో భాస్కర్, కోఆర్డినేటర్ రాజశేఖర్, పాఠశాల సిబ్బంది, బాలబాలికలు పాల్గొన్నారు.

# మహిళలకు ఆరాధ్యదైవం మహాత్మా జ్యోతిబాపూలే



**డోన్ ప్రతినిధి ఏప్రిల్ 11 (రిపబ్లిక్ న్యూస్)** మహిళలకు ఆదర్శనీయులు జ్యోతిబా పూలే అని యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. నంద్యాల జిల్లా డోన్ మండలం డోన్ పట్టణం నందలి మహాత్మ జ్యోతిరావుపూలే ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల (బాలికల) నందు యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ,డోన్ మండల కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే 198 వ జయంతి సందర్భంగా పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి మరియు విగ్రహాల దాత, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపల్ వసుంధర దేవి యస్సీ యస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మిడి లక్ష్మణ్ సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ మహిళల విద్య కొరకు పాటుపడిన మహోన్నతమైన మహనీయులు జ్యోతిబా పూలే అని ఆమె అన్నారు. తన భార్య అయిన సావిత్రిబాయిపూలే కు చదువు నేర్పించి ఆమెను ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది ఆమె ద్వారా మహిళలకు విద్యనందించి మహిళలను గౌరవించిన జ్యోతిరావుపూలే మహిళలకు ఆరాధ్యదైవం అని ఆమె తెలిపారు. మహిళలు, క్రింది కులాల వారు చదువుకుని విజ్ఞానవంతులు అయితేనే సామాజిక చైతన్యం కలుగుతుందని, సామాజిక చైతన్యం వచ్చినపుడే బహుజనులు అభివృద్ధి వైపు అడుగులు వేయగలరని పూలే ఆశించారని ఆమె అన్నారు. బహుజన కులాల అభివృద్ధి కోసం జీవితాన్ని అర్పించిన మహాత్మా జ్యోతిరావు పూలే 1890 నవంబర్ 28 వ తేదీన కన్నుమూశారు. ఆ మహనీయుల ఆలోచనలతో, వారి ఆశయాల కోసం బహుజనులు అందరూ ఏకమై కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షురాలు భారతమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ,నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుతోట పద్మావతి, గుత్తి మండల అధ్యక్షురాలు సుంకమ్మ, షేకున్ బి, లక్ష్మేశ్వరి, ఖాసీంబీ దస్తగిరమ్మ, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబా పూలే కు ఘన నివాళులు

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 11:** దళితులు మహిళలు ఇతర వెనుకబడిన వర్గాల అభ్యున్నతకి కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే గొప్ప సంఘ సంస్కర్త అని ఆయన అడుగుజాడలే స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం పద్మావతి నగర్ సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే కుల, మత వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన మహనీయ వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే అని కొనియాడారు. 1848లో ఆడపిల్లల విద్యాభ్యాసం కోసం ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి పాఠశాలను ప్రారంభించారు. ఆడపిల్లలకు మంచి చదువు అందిస్తే తన కోసమే కాదు తన కుటుంబ సభ్యులందరినీ విద్యావంతులను చేసే బాధ్యత తీసుకుంటుందనే ఉద్దేశంతోనే ఆనాడే ఆడపిల్లల కోసం ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారు. మహాత్మ జ్యోతిబాపూలే ఆయన సతీమణితో కలిసి మహిళా విద్యా వ్యవస్థకు పునాదివేసారన్నారు. ఆడపిల్లల చదువుకు శ్రీకారం చుట్టి అనేక గ్రంధాలు రచించారని ఆ పుస్తకాలన్నీ విద్యార్థులు అభ్యసిస్తే మరిన్ని విషయాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రమణయ్య గౌడ్, శ్రీనివాసులు, పులి కొండన్న, గుర్రప్ప, పృథ్వీరాజ్ యాదవ్, గురం లక్ష్మి, విజయ గౌరీ, జిల్లెల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# నేడు హనుమాన్ జయంతి

జగిత్యాలఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్: శ్రీ రాముని భక్తుడైన హనుమంతుడిని పూజిస్తూ హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకుంటారు. హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండగలలో ఒకటి ఇది. ఏప్రిల్ 12వ తేదీ శనివారం హనుమాన్ జయంతిని ఎంతో ఉత్సాహంగా జరుపుకోవడానికి భక్తులు సిద్ధం అవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండట్టులో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహిస్తారు. దీక్షాపరులు ఇప్పటికే కొండట్టుకు చేరుకున్నారు. ఈ రోజు తన అసమానమైన శారీరక బలం, అచంచలమైన భక్తి , నిస్వార్థ సేవకు ప్రసిద్ధి చెందిన హనుమంతుడి జన్మదినోత్సవం. కేసరి అంజన దేవిల తనయుడు ఆంజనేయుడు. హనుమంతుడు కేసరి అని కూడా పిలుస్తారు. ఆంజనేయస్వామి ధైర్యం, నిస్వార్ధ సేవ అంకితభావానికి ప్రతీక. మన దేశంలోని హిందువులు మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఈ రోజును హనుమతుండిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ రోజున భక్తులు బజరంగ బలి ఆశీర్వాదం కోసం రామలయలను, హనుమంతుడి ఆలయాలను సందర్శిస్తారు. ఉపవాసం ఉంటారు. హనుమాన్ చాలీసాను జపిస్తారు. అయితే ఈ ఆధ్యాత్మిక వేడుకను జరుపుకోవడానికి అనుసరించాల్సిన నిర్దిష్ట సంప్రదాయాలు, నిబంధనలు ఉన్నాయి. అలాగే నివారించాల్సిన పద్ధతులు కూడా ఉన్నాయి. దృక్ పంచాంగం ప్రకారం చైత్ర మాసం పౌర్ణమి తిథి శనివారం, ఏప్రిల్ 12వ తేదీ హనుమంతుడి జయంతిని పౌర్ణమి రోజు జరుపుకోనున్నారు. హిందూ మతంలో ముఖ్యమైన పంగడ కనుక చాలా మంది ఈ రోజు ఉపవాసం ఉంటారు. హనుమంతుడిని అత్యంత భక్తిశ్రద్దలతో పుజిస్తారు.

# 31 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత






**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 11(రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు, నంద్యాల మెడికల్ కాలేజీలు మరియు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లు, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కర్నూలు యందు కాంట్రాక్ట్ ,అవుట్ సోర్సింగ్, క్రింద 9 కటగిరీలకు చెందిన పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం జరిగింది. మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు లలో వివిధ టెక్నికల్ నాన్ టెక్నికల్ పోస్టుల నియమకాలకోసం 2023లో ఇచ్చిన నోటిఫికేషన్ లో మెరిట్ రోస్టర్ ప్రకారం ఎంపికైన 9 కేటగిరీల చెందిన మొత్తం 31 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వజన వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ మంజుల రాణి, ఏవోలు లక్ష్మీ ప్రసన్న,రమ్య తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలి

**- జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎలుక రాజుయాదవ్**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11( రిపబ్లిక్ న్యూస్)** ఈనెల 13న బీపీ మండల్ యాదవ్ వర్ధంతి , గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం 4వ ఆవిర్భావ దినోత్సవాన్ని యాదగిరి గుట్ట( యాదాద్రి) లోని లక్కీ ఫంక్షన్ హాల్లో ఉ.10 గం. కు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, గొర్రెల కాపర్లు పాల్గొని జయప్రదం చేయాలని జగిత్యాల జిల్లా గొఱ్ఱెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎలుక రాజు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్ల, కురుమల, గొఱ్ఱెల కాపరుల ప్రస్తుత స్థితిగతులు, ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల నిర్వహణ,సంక్షేమం పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతెన్నులపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

# వెయ్యి ఎకరాల్లో వరి పంటలు నష్టం



**మహానంది, ఏప్రిల్11,( రిపబ్లిక్ న్యూస్):** మహానంది మండలంలోని తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాలలో గాలి, వానకు పడిపోయిన వరి పొలాలను నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానంది మండలంలో రబీ సీజన్లో 7100 ఎకరాలలో వరి పంట సాగు చేయడం జరిగిందని, ఇప్పటికే 4 వేల ఎకరాలకు పైగా వరి కోతలు పూర్తి అయ్యాయని అన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల వచ్చిన గాలి, వానకు 1000 ఎకరాల్లో వరి పంటలు పడిపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు. పంట నష్టంపై అంచనా వేసి ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అన్నారు. రైతులు పొలంలో ఉన్న నీటిని కాలువల ద్వారా వెంటనే తొలగించాలని, అదే విధంగా కట్టలు కట్టుకోవాలని సూచించారు. గింజ గట్టిపడిన పంటపై మొలకలు రాకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు మధు రైతులు పాల్గొన్నారు. మహానంది మండలంలో గత 2 దఫాలుగా వచ్చిన అకాల వర్షాలు భారీ గాలులకు మండల పరిధిలో 65 ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగినట్లు, ప్రాథమికంగా గుర్తించామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్‌తో కలిసి శుక్రవారం ఆయన పడిపోయిన అరటి తోటలను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.



## ఉదయానంద ఆసుపత్రి డాక్టర్ల బృందం చే
# సిరివెళ్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** ఖండే ఆనంద్ గురూజీ, ఖండే శ్యామ్ ఆర్థిక సహకారంతో రేపు ఉదయం 9 గంటలకు నుండి సాయంత్రం 6 గంటల వరకు (అనగా 13-04-25) నంద్యాల పట్టణంలోని ఉదయానంద ఆసుపత్రి డాక్టర్ల బృందంచే ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ పోగుల సౌమ్య రెడ్డి వారి నేతృత్వంలో పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేయబడును. సిరివెళ్లలోని ఉల్లి నగేష్ కాంప్లెక్స్ నందు శ్రీవాణి స్కూల్ పక్కన వైద్య శిబిరం నిర్వహించబడును. కంటి శుక్లం, కంటి పొర ఉన్నవారికి ఆపరేషన్, చత్వారం ఉన్నవారికి కంటి అద్దాలు, కంటి నొప్పి ఇతర సమస్యలు ఉన్నవారికి చుక్కల మందు, టాబ్లెట్స్ ఈ క్యాంపు నందు ఉచితంగా ఇవ్వబడును. కేవలం ఒకటి రెండు రోజుల్లోనే కంటి ఆపరేషన్ చేసి డిశ్చార్జి చేయబడును. ఆపరేషన్ చేయించుకునే వారికి కాఫీ, టిఫిన్, భోజనం ఉచితంగా అందజేయబడును. టోకెన్ కొరకు 90329 08777, 99899 83673 నంబర్లకు సంప్రదించి పేరు నమోదు చేసుకోగలరని ఆయుష్ యోగా సేవ సమితి నంద్యాల వారు పేర్కొన్నారు.

# అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ నియామకం



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 11( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామ డా. బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా ఆరెల్లి మహేష్, చైర్మన్ గా దర్శనాల నరేష్, వైస్ చైర్మన్ లుగా కేడం విజయ్ కుమార్, ఆరెల్లి సదన్, ప్రధాన కార్యదర్శిగా ఆరెల్లి శ్రీహరి, ప్రచార కార్యదర్శిగా ఆరెల్లి విజయ్, కోశాధికారిగా మోతే సత్యం, కార్యవర్గ సభ్యులుగా దర్శనాల రాకేష్, ఆరెల్లి మల్లేష్, ఆరెల్లి శంకరయ్య, మోతే సురేందర్, సలహాదారులుగా మంచినీళ్ల కుమారస్వామి, జైన పెద్ద బానయ్య, ఆరెల్లి రాజయ్య, దర్శనాల రవీందర్ లు నియామకమయ్యారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆరెల్లి మహేష్, నేతకాని సంఘం అధ్యక్షుడు మోతే సత్యం, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎలుక భగవాన్ యాదవ్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎలుక రాజు యాదవ్, నాయకులుఆరెల్లి బాబురాజు, జువ్వ లక్ష్మణ్, ఆరెల్లి రవీందర్, జువ్వ వెంకటేష్,మోతే బానయ్య, ఎలుక శంకరయ్య, ఆరెల్లి అనిల్, గోల్లే శంకరయ్య, ముంజాల రాజు తదితరులు పాల్గొన్నారు



# ముంబయి ఆల్‌రౌండర్ కార్బిన్‌పై ఏడాది నిషేధం

ముంబయి ఇండియన్స్ ప్లేయర్‌కు షాక్ తగిలింది. అతడిని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు బ్యాన్ చేసింది. దీంతో ఆ ఆటగాడు పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పాల్గొనలేడు. అతడిపై ఏడాది కాలం పాటు నిషేధం ఉంటుందని పీసీబీ వెల్లడించింది. సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ కార్బిన్ బాష్ ఇటీవల పీఎస్ఎల్ ఫ్రాంఛైజీ పెషావర్ జల్మీకి ఎంపికయ్యాడు. మరోవైపు ముంబయి ఇండియన్స్ ప్లేయర్ లిజార్డ్ విలియమ్స్ గాయం కారణంగా దూరం కావడం వల్ల కార్బిన్ బాష్‌ను రిప్లేస్‌మెంట్‌గా తీసుకుంది. అయితే ఈ రెండు టోర్నీలు ఒకేసారి జరుగుతుండడం వల్ల కార్బిన్ ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. పీఎస్ఎల్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. దీంతో తమతో చేసుకున్న ఒప్పందం ఉల్లంఘించినందుకు పీసీబీ అతడికి లీగల్ నోటీసులు పంపింది. అలాగే కార్బిన్‌పై ఏడాది నిషేధం విధించింది. కాగా, ఈ సస్పెన్షన్‌పై బాష్ స్పందించాడు. పీఎస్ఎల్ నుంచి వైదొలగినందుకు అక్కడి అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. '%ఞూూ%ను తక్కువ చేయడం నా ఉద్దేశం కాదు. ముంబయి ఇండియన్స్ బలమైన ఐపీఎల్ జట్టు మాత్రమే కాదు. ఇతర లీగ్‌ల్లో కూడా ముంబయి ఫ్రాంఛైజీలు ఉన్నాయి. అందుకే నా భవిష్యత్ కోసం ఈ నిర్ణయం తీసుకున్నాను. పీఎస్ఎల్ నుంచి వైదొలగినందుకు పాక్ అభిమానులకు సారీ చెబుతున్నా. దీనికి బాధ్యత వహిస్తా. జరిమానాతోపాటు నిషేధాన్ని కూడా అంగీకరిస్తున్నా. భవిష్యత్‌లో మళ్లీ పీఎస్ఎల్‌లో ఆడతానని ఆశిస్తున్నా' అని బాష్ పేర్కొన్నాడు.సాధారణంగా పీఎస్ఎల్ ప్రతి సీజన్ ఫిబ్రవరి, మార్చి నెలలో జరగుతుంది. కానీ, పాకిస్థాన్ క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉండడం వల్ల ఏప్రిల్- మే విండోలోనే టోర్నీ నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 11న ఇది ప్రారంభం కానుంది. దీంతో ఐపీఎల్- పీఎస్ఎల్ టోర్నీల్లో క్లాష్ ఏర్పడింది. ఈ క్రమంలోనే బాష్ పీఎస్ఎల్ కంటే ఐపీఎల్‌లో ఆడేందుకే మొగ్గు చూపాడు. అంతేకాకుండా సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో బాష్ ముంబయి కేప్ టౌన్ ఫ్రాంఛైజీకి ప్రాకినిధ్యం వహిస్తున్నాడు.

# రోహిత్ శర్మ నా ఫేవరేట్ క్రికెటర్

## సన్‌రైజర్స్ విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తన ఫేవరేట్ ఇండియన్ క్రికెటర్ అని, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ తెలిపాడు. రోహిత్ శర్మ బ్యాటింగ్ అంటే తనకు చాలా ఇష్టమని చెప్పాడు. అతని కెప్టెన్సీ కూడా అద్భుతమని కొనియాడాడు. ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ఓ క్రికెట్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రావిస్ హెడ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ ఇంటర్వ్యూలో క్వశ్చన్ ఆన్సర్ సెషన్ నిర్వహించగా.. ట్రావిస్ హెడ్ తనదైన శైలిలో బదులిచ్చాడు.రోహిత్ శర్మ తన ఫేవరేట్ ఇండియన్ బ్యాటర్ అని చెప్పిన ట్రావిస్ హెడ్.. ఆస్ట్రేలియా జట్టులో ఉండాలని తాను కోరుకునే భారత ఆటగాడు కూడా అతనేనని తెలిపాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కాకుండా ఇతర ఫ్రాంచైజీకి ఆడాలంటే ముంబై ఇండియన్స్‌ను ఎంచుకుంటానని చెప్పాడు. మూడు ప్రశ్నలకు సమాధానం రోహిత్ శర్మకు సంబంధించినవే చెప్పడంతో రోహిత్ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోహిత్ శర్మకు ట్రావిస్ హెడ్ డై హార్డ్ ఫ్యాన్ ఉన్నట్టున్నాడుగా అని కామెంట్ చేస్తున్నారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ట్రావిస్ హెడ్ వైఫల్యం కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ట్రావిస్ హెడ్ ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 67, 47, 22, 4, 8 పరుగులే చేశాడు. అతని వైఫల్యం జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తోంది. తొలి మ్యాచ్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా 4 మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. పంజాబ్ కింగ్స్‌తో శనివారం జరిగే మ్యాచ్‌లోనైనా ట్రావిస్ హెడ్ రాణించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ట్రావిస్ హెడ్‌పై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ అభిమాని సెల్ఫీ రిక్వెస్ట్‌ను అతను నిరాకరించడం నెట్టింట చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. సూపర్ మార్కెట్‌కు వచ్చిన ట్రావిస్ హెడ్‌ను కొందరు అభిమానులు సెల్ఫీ కావాలని కోరారు. అందుకు ట్రావిస్ హెడ్ నిరాకరించాడు. తాము సన్‌రైజర్స్ అభిమానులమని చెప్పినా వినిపించుకోలేదు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. ఇంత బలుపు ఏంటని ఫ్యాన్స్ మండిపడ్డారు.

# కోల్‌కతా సునాయాస విజయం..

## చెన్నైకు వరుసగా ఐదో ఓటమి



తాజా ఐపీఎల్ (%ఞూ% 2025)లో చెన్నై సూపర్ కింగ్స్ (%జుఖ%) వరుసగా ఐదో పరాజయాన్ని మూటగట్టుకుంది. స్వంత మైదానం అయిన చెన్నైలోని చిదంబరం స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ (%ఖఖ= జం జుఖ%) దారుణ పరాజయాన్ని చవిచూసింది. ఏకంగా 8 వికెట్ల తేడాతో ఓడిపోయింది. టాస్ గెలిచిన కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో చెన్నై టీమ్ బ్యాటింగ్‌కు దిగింది. కోల్‌కతా స్పిన్నర్ల ఉచ్చులో చిక్కుకున్న చెన్నై కష్టాల్లో పడి స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకు మూడో ఓవర్లో మొయిన్ అలీ షాకిచ్చాడు. డాన్ కాన్వే (12)ను పెవిలియన్ చేర్చాడు. అప్పట్నుంచి క్రమం తప్పకుండా చెన్నై వికెట్లను కోల్పోతూనే ఉంది. శివమ్ దూబే (31), రాహుల్ త్రిపాఠి (16), విజయ్ శంకర్ (29) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. రచిన్, అశ్విన్, జడేజా, హుడా, ధోనీ, నూర్ అహ్మద్, కాంబోజ్ మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై కోల్‌కతా క్వాలిటీ స్పిన్నర్లు ఎదుర్కోలేక చతికిల పడ్డారు. దీంతో చెన్నై 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 103 పరుగులు మాత్రమే చేయగలిగింది. చెన్నై బౌలర్లలో సునీల్ నరైన్ మూడు వికెట్లు దక్కించుకున్నాడు. వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా రెండేసి వికెట్లు పడగొట్టారు. మొయిన్ అలీ, వైభవ్ అరోరా ఒక్కో వికెట్ తీశారు.

104 పరుగులు స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా సునాయాసంగా విజయం సాధించింది. ఓపెనర్లు సునీల్ నరైన్ (44), డికాక్ (23) మంచి ఆరంభాన్ని అందించారు. వేగంగా పరుగులు చేశారు. డికాక్‌ను కాంబోజ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. డికాక్ అవుట్ అనంతరం క్రీజులోకి వచ్చిన రహానే (20 నాటౌట్) అచితూచి ఆడుతూ జట్టును విజయతీరాలకు చేర్చాడు. చెన్నై నిర్దేశించిన లక్ష్యాన్ని కేవలం 10.1 ఓవర్లలోనే కేకేఆర్ ఛేదించింది. దీంతో చెన్నై టీమ్ ఈ సీజన్‌లో వరుసగా ఐదో ఓటమిని మూటగట్టుకుంది. పాయింట్ల పట్టికల్లో అట్టడుగు స్థానానికే పరిమితమైంది.



# 'కాంపా' బ్రాండ్ అంబాసిడర్ గా రామ్ చరణ్...

## రిలయన్స్ తో జట్టుకట్టిన గ్లోబల్ స్టార్

## రిలయన్స్ అధీనంలో కాంపా డ్రింక్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రిలయన్స్ ఇండస్ట్రీస్ తో జట్టుకట్టాడు. రిలయన్స్ కు చెందిన ప్రముఖ శీతల పానీయాల బ్రాండ్ కాంపా డ్రింక్ కు బ్రాండ్ అంబాసిడర్ గా నియమితుడయ్యాడు. ఈ మేరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. 2023 మార్చిలో మార్కెట్లో రంగప్రవేశం చేసిన కాంపా వేగంగా ఎదుగుతోంది. ఈ నేపథ్యంలో, భారత్ లో అత్యధిక ప్రజాదరణ ఉన్న వ్యక్తుల్లో ఒకరైన రామ్ చరణ్ తో భాగస్వామ్యం ఒక మైలురాయి అని చెప్పవచ్చు. కాగా, రామ్ చరణ్ తో కాంపా ప్రత్యేక యాడ్ ను కూడా రూపొందించారు. 'కాంపా వాలీ జిద్ద్' పేరిట ఈ యాడ్ ను ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఈ యాడ్ ను ఐపీఎల్ లోనూ, ఇతర వేదికలపైనా, టీవీల్లో, మొబైల్ వేదికలపైనా ప్రసారం చేయనున్నారు.

# లక్షకు చేరువలో పసిడి

**భారీగా పెరిగిన బంగారం ధర..**

**%అమెరికా, చైనా మధ్య తీవ్రమైన సుంకాల పోరు**

**సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం వైపు పెట్టుబడిదారుల మొగ్గు**

**హైదరాబాద్‌లో రూ. 96,430 పలికిన బంగారం ధర**

బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పసిడి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అమెరికా, చైనా మధ్య సుంకాల పోరు తీవ్రమవుతుండటంతో, పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పసిడి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దేశంలో బంగారం ధరలు ఈరోజు రూ. 6 వేలకు పైగా పెరిగి రూ. 96,000 దాటింది.ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 6,250 పెరిగి రూ. 96,450కి చేరుకుంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సాయంత్రం రూ. 96,430 వద్ద ట్రేడ్ అయింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3,223 డాలర్ల వద్ద కొనసాగుతోంది. వాణిజ్య యుద్ధాల భయంతో పది రోజుల క్రితం ఔన్సు బంగారం ధర 3,200 డాలర్లను తాకింది. ఆ తర్వాత లాభాల స్వీకరణ కారణంగా కాస్త తగ్గింది. అయితే ఇతర దేశాలపై టారిఫ్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాపై మాత్రం కొనసాగించారు. దీంతో అమెరికాపై చైనా 125 శాతం టారిఫ్ విధించింది. టారిఫ్ యుద్ధం ప్రభావం పసిడి ధరలపై పడుతోంది.



# భారత్‌కు ఏఐ మోడల్స్ లేవన్న బాధొద్దు..

## ఆధార్ రూపకర్త నందన్ నీలేకని వ్యాఖ్య



%ఇంటర్నెట్ డెస్క్: భారత దేశానికి తనకంటూ 'డీప్ సీక్', 'చాట్‌జీపీటీ' లాంటి భారీ ఏఐ మోడల్స్ లేకపోవడంపై చింతించాల్సిన అవసరం లేదని ఆధార్ రూపకర్త, ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నందన్ నీలేకని అన్నారు. భారత్ ఇప్పటికే తనకంటూ ఓ ఏఐ మిషన్‌ను ఏర్పాటు చేసుకుందని, ఎన్నో చిన్న తరహా మోడల్స్ ఉన్నాయని అన్నారు. వీటిని మరింతగా విస్తరించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తున్న ఏఐ విప్లవంపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేశారు %"మునుపటి సాంకేతిక విప్లవాలకు, నేటి ఏఐ విప్లవానికి మధ్య తేడా ఏంటంటే నేడు మనం కంప్యూటర్ ఆధారిత మేథోశక్తిపై ఎక్కువ నమ్మకం ఉంచాల్సిన పరిస్థితి ఉంది. మునుపటి టెక్నాలజీల్లో కచ్చితత్వంతో మనుషుల అంచాలకు తగినట్టుగా ఉండేవి. ఇప్పుడు మనం యంత్రాలు ఈ నిర్ణయాలు తీసుకోవాలని ఆశిస్తున్నాము. యంత్రాలపై నమ్మకంతో ముందుకెళుతున్నాము" అని నీలేకని అన్నారు. ఏఐ రంగంలో పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ ఇండియాకు ఉన్న బలమైన డిజిటల్ మౌలిక వసతులు (యూపీఐ, ఆధార్) అక్కరకు వస్తాయని అన్నారు. వీటి సాయంతో ఏఐ సాంకేతికతను విస్తరించొచ్చని అభిప్రాయపడ్డారు. భారీ ఏఐ మోడల్స్ రూపకల్పనలో పోటీ పడే బదులు భారత్ అవసరాలకు అందుబాటులో ఉండే బాధ్యతాయుతమైన, సమ్మిళిత ఏఐ పరిష్కారాలను కనుగొనాలని అన్నారు. ఓపెన్ ఏఐ, గూగుల్, మైక్రోసాఫ్ట్ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఏఐ రంగంలో చైనాకు చెందిన డీప్ సీక్ ఏఐ రాక పోటీని ఒక్కసారిగా పెంచేసిన విషయం తెలిసిందే. చాట్‌జీపీటీ కోసం ఓపెన్ ఏఐ 540 మిలియన్ డాలర్లు ఖర్చు చేయగా ఓపెన్ సోర్స్ మోడల్ ఆధారిత డీప్ సీక్‌కు మాత్రం కేవలం 6 మిలియన్ డాలర్లే ఖర్చయ్యాయి. దీంతో, టెక్ కంపెనీలు వేగం పెంచాయి. తక్కువ ఖర్చుతో ఓపెన్ ఆధారిత ఏఐ ఉత్పత్తులను పలు కంపెనీలు మార్కెట్‌లోకి వడివడిగా విడుదల చేస్తున్నాయి.

# తగ్గేదేలే అంటున్న వర్మ...

## మరో సినిమా ప్రకటన



టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తాజా చిత్రం 'శారీ' బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈ సినిమాలో హీరోయిన్ అందాలను ఆరబోసినప్పటికీ ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోలేదు. వరుసగా ఫ్లాపులు వస్తున్నప్పటికీ వర్మ ఏమాత్రం తగ్గడం లేదు. మరో సినిమాను ప్రకటించారు. 'పోలీస్ స్టేషన్ మే బూత్' అనే హారర్ చిత్రాన్ని ప్రకటించారు. 'మీరు చనిపోయిన వారిని చంపలేరు' అనేది ఈ సినిమా ట్యాగ్ లైన్. ఈ సినిమాలో మనోజ్ బాజ్ పేయి ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా గురించి వర్మ మాట్లాడుతూ... మనం భయపడినప్పుడు పోలీసుల దగ్గరకు వెళతామని... పోలీసులు భయపడినప్పుడు ఎక్కడకు పరుగెత్తుతారు? అనే పాయింట్ మీద కథ తిరుగుతుందని చెప్పారు. ఒక భారీ ఎన్ కౌంటర్ తర్వాత ఓ పోలీస్ స్టేషన్ దెయ్యాల స్టేషన్ గా మారుతుందని... గ్యాంగ్ స్టర్ దెయ్యాల నుంచి తప్పించుకోవడానికి పోలీసులందరూ భయంతో పరుగెత్తుతూ ఉంటారని తెలిపారు. ఈ సినిమాపై వర్మ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నట్టు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది.

# ఎటూ తేల్చుకోలేకపోతున్న ఐశ్వర్య



సక్సెస్, ఫెయిల్యూర్ రెండూ ఆర్టిస్టులకు నిద్ర పట్టనీయవు. ఒకవేళ సక్సెస్ వస్తే ఆ సక్సెస్ ను ఎలా నిలుపుకోవాలా అని ఆలోచిస్తూ తర్వాతి సినిమాల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. అదే ఫ్లాప్ అయితే తర్వాతి సినిమా అయినా ఇంకా బెటర్ గా ఉండాలని ఆ కోణంలో జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. అందుకే ఆర్టిస్టుని హిట్టూ, ఫ్లాపూ ఊపరాడనీయకుండా చేస్తాయంటారు. ఇప్పుడు తెలుగమ్మాయి ఐశ్వర్యా రాజేష్ కూడా అలాంటి పరిస్థితే ఎదుర్కొంటుంది. ఐశ్వర్యా రాజేష్ పేరుకే తెలుగమ్మాయి కానీ అమ్మడు తమిళంలోనే బాగా పాపులరైంది. తమిళంలో ఐశ్వర్య రాజేష్ ఎన్నో సినిమాలు చేసింది. వెంకటేష్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్ బస్టర్ మూవీ సంక్రాంతికి వస్తున్నాంతో ఐశ్వర్యా రాజేష్ ఈ ఏడాది మంచి హిట్ అందుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమాలో భాగ్యం పాత్రలో ఐశ్వర్యా రాజేష్ నటనకు అందరూ ఫిదా అయ్యారు. వెంకటేష్ తో పోటీ పడి మరీ ఐశ్వర్య ఆ సినిమాలో నటించింది. అయితే సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో పాటూ అమ్మడి పాత్రకు కూడా మంచి ప్రశంసలు రావడంతో ఐశ్వర్యకు వరుస ఆఫర్లు వస్తాయని, ఆమె కూడా వరుస పెట్టి సినిమాలు చేస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పటివరకు ఐశ్వర్య తన నెక్ట్స్ తెలుగు సినిమాను ఇంకా అనౌన్స్ చేయలేదు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అందుకున్న సక్సెస్ ను కంటిన్యూ చేయాలని ఐశ్వర్యా రాజేష్ ఎంతో జాగ్రత్తగా ఉంటూ తర్వాతి సినిమాల ఎంపికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఎటూ తేల్చుకోలేకపోతుంది. కాస్త లేటైనా సరే మంచి కథ వచ్చే వరకు సినిమాను ఒప్పుకోకూడదని డిసైడింది ఐశ్వర్యా. ఆల్రెడీ రెండు స్క్రిప్ట్స్ ను పూర్తి చేసిన ఐశ్వర్య ఈ ఏడాది తర్వాత వాటిని అనౌన్స్ చేసే ఛాన్సుంది. తమిళంలో కరుప్పర్ నగరం, మోహన్ దాస్ మరియు తీయావర్ కులైగల్ నడుంగ సినిమాలకు కమిట్ అయిన ఐశ్వర్యా ఆల్రెడీ షూటింగ్ లో ఉన్న కన్నడ సినిమా ఉత్తరాకాండలో కూడా నటిస్తోంది. త్వరలోనే ఐశ్వర్య తన తెలుగు సినిమాను ప్రకటించే అవకాశముంది.

# నెగెటివ్ ప్రచారాలపై మండిపడ్డ త్రిష



సోషల్‌మీడియా వేదికగా నెగెటివిటీని వ్యాప్తి చేసే వారిపై నటి త్రిష అసహనం వ్యక్తంచేశారు. వారిది విషపూరితమైన స్వభావం అని పేర్కొన్నారు. ఇతరులపై బురద జల్లడమే వారి పనన్నారు. విషపూరితమైన వ్యక్తులు.. అసలు మీరెలా జీవిస్తున్నారు? మీకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది? ఖాళీగా కూర్చొని ఇతరులను ఉద్దేశించి సోషల్‌మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులు పెట్టడమేనా మీ పని, మిమ్మల్ని చూస్తుంటే నిజంగా భయమేస్తుంది. అని త్రిష ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. త్రిష ఈవిధమైన పోస్టులు పెట్టడం ఇదేమీ తొలిసారి కాదు. తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే వారిపై గతంలోనూ ఆమె మండిపడ్డారు. వారి ప్రవర్తన ఏమీ బాగోలేదన్నారు. అలాంటి వారి మాటలు పట్టించుకోనని చెప్పారు. ఉన్నట్టుండి త్రిష ఈవిధంగా పోస్టు పెట్టడానికి కారణం లేకపోలేదు. ఆమె నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో ఆమె రోల్‌ను కొంతమంది మెచ్చుకుంటున్నారు. ఆమె అందంగా కనిపించారని అంటున్నారు. మరికొంతమంది మాత్రం ఆమె యాక్టింగ్ ఏమీ బాలేదంటున్నారు. తమిళం తెలిసినప్పటికీ సినిమాలోని తన పాత్రకు వేరే వారితో డబ్బింగ్ చెప్పించడం ఏమిటని ఆమెను ప్రశ్నిస్తున్నారు.

# మాస్ జాతరతో వస్తోన్న రవితేజ




వరుసగా చిత్రలు ఫెయిల్ అవుతున్నా...గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తూ తన ఎనర్జీని ప్రూవ్ చేస్తూ మాస్ మహారాజా రవితేజ దూసుకెళ్తున్నారు. -టైగర్ నాగేశ్వరరావు, ఈగెల్ సినిమాల తర్వాత మిస్టర్ బచ్చన్ సినిమా ద్వారా ప్రేక్షకులను పలకరించిన రవితేజకు ఆశించిన ఫలితం మాత్రం రాలేదు. దీంతో ఎలాగైనా హిట్ కొట్టాలనే పట్టుదలతో మరో మాస్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో భాగంగానే భాను బోగవరపు దర్శకత్వంలో రూపొందుతున్న 'మాస్ జాతర' అనే పవర్‌ఫుల్ టైటిల్ పెట్టారు. రవితేజ కెరీర్‌లో ఇది 75వ సినిమా కావడంతో ఫ్యాన్స్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.సూర్యదేవర నాగవంశీతో పాటు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన శ్రీలీల హీరోయిన్‌గా మరోమారు జోడి కట్టింది. ఇద్దరి ఎనర్జీ కలిసితే స్క్రీన్ మీద పండగే అంటున్నారు ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌కి మంచి ఆదరణ ఉంది. ఇకపోతే తాజాగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ 'టూ మేరా లవర్' ను ఏప్రిల్ 14 న విడుదల చేయబోతున్నట్టు- చిత్రబృందం ప్రకటించింది. మాస్ బీట్, రవితేజ-శ్రీలీల ఎనర్జీ తో ఈ సాంగ్ సంగీత ప్రియులను ఊపేస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటకు మాస్ ట్యూన్స్ స్పెషలిస్ట్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్, పోస్టర్స్ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. అభిమానులకు ఈ 'మాస్ జాతర' పండుగలా మారనుంది.

# మే 9ననే హరిహరవీరమల్లు

## రూమర్స్‌కు చెక్ పెట్టిన మూవీ మేకర్స్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతోన్న సినిమా 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందుతోంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రిలీజ్ కానుంది. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల అవుతున్నట్లు- ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. అయితే హరిహర వీరమల్లు విడుదల ఆలస్యం కానున్నట్లు- కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ రూమర్స్‌పై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. మే 9న హరిహర వీరమల్లు సినిమాను విడుదల చేయనున్నట్లు- మేకర్స్ సోషల్ మీడియాలో తెలిపారు. 'రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మెరుపు వేగంతో పనులు దూసుకుపోతున్నాయి. ఈ వేసవికి అద్భుతమైన సినిమాను ప్రేక్షకులకు అందిస్తాము. మే 9న హరిహర వీరమల్లు బిగ్ స్క్రీన్‌లలో విడుదల అవుతుంది. మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభూతికి ప్రేక్షకులు సిద్ధంగా ఉండండి' అని మేకర్స్ ట్వీట్ చేశారు. పవన్‌కు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను సైతం రిలీజ్ చేశారు. ఈ పోస్టుతో నెట్టింట రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారు.హరిహర వీరమల్లు సినిమా రెండు భాగాలుగా రానుంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటించారు. అనుపమ్ ఖేర్, బాబీ దేవోల్, నోరా ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవన్ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉండడంతో ఈ సినిమా షూటింగ్ లేట్ అయింది. ముందుగా మార్చి 28న విడుదల చేయాలని భావించినా.. మే 9కు వాయిదా వేశారు.

# పూరి,ఛార్మిల సినిమా లో టబూ?



వరుస డిజాస్టర్లతో ఇబ్బంది పడుతున్న పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతితో ఒక సినిమా తీస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాని ఛార్మి కౌర్ నిర్మాతగా నిర్మించబోతున్నారు. ఇక ఈ సినిమాకి సంబంధించి అనేక విషయాలు తెరమీదకి వస్తూనే ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఈ సినిమాలో టబూ లేదా రవినా టాండన్, ఇద్దరిలో ఒకరు కీలక పాత్రలో నటించే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. అయితే, ఎట్టకేలకు టబూ ఫిక్స్ అయింది. ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ, పూరి జగన్నాథ్, ఛార్మితో కలిసి టబూతో ఉన్న ఒక ఫోటోని సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. పూరి జగన్నాథ్ చెప్పిన లైన్ విని సేతుపతి బాగా ఎక్సైటెడ్ అయ్యాడని, ఎప్పుడెప్పుడు సినిమా మొదలు పెడదామా అని ఎదురు చూస్తున్నాడని అంటు-న్నారు. ఇక ఈ సినిమాలో టబూ ఒక పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నట్లు-గా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాతో పూరి జగన్నాథ్ మంచి కంబ్యాక్ ఇస్తాడని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు.

# విశ్వంభర రామరామ పాట ప్రోమో విడుదల



చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం'విశ్వంభర.' యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం నుంచి తొలి గీతం 'రామ రామ'ను ఈ శనివారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చిరంజీవి చుట్టూ పిల్లలు హనుమంతుడి వేషధారణలో ఉన్నారు. అలాగే బ్యాక్‌డ్రాప్‌లో రాముడి విగ్రహం ఉంది. 'రామ రామ' పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. కాగా, ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్లు. కునాల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.



## అణగారిన వర్గాల అభ్యున్నతి విశేష కృషి చేసిన

# మహనీయ వ్యక్తి మహాత్మ జ్యోతిబా పూలే...

**రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**514 మంది లబ్ధిదారులకు రూ.12.37 కోట్ల సబ్సిడీ - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల ప్రతినిధి, ఏప్రిల్ 11, రిపబ్లిక్ న్యూస్ :-** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం శ్రీ మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం సమీపంలో ఉన్న సమీకృత ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతోత్సవ సభ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లా కలెక్టర్ తో కలిసి మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అంటూ పూలే సేవలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పూలే భావించారన్నారు. అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. మహిళలు చదువుకుంటేనే అసమానతలు తొలగిపోతాయని భావించి మొదట తన భార్య సావిత్రీబాయిని విద్యావంతురాలిని చేసిన గొప్ప ఆచరణ వాది అని కొనియాడారు. సమాజ పునర్నిర్మాణానికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.

జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కుల, మత, వర్గా విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. ఏప్రిల్ మాసంలో ముగ్గురు మహనీయుల జయంతోత్సవాలు 5వ తేదీన డా.బాబు జగ్జీవన్, 11వ తేదీన మహాత్మ జ్యోతిబా పూలే, 14వ తేదీ అంబేద్కర్ జయంతిలు ఎంతో ఘనంగా జరుపుకుంటామన్నారు. ఈ జయంతోత్సవాల కార్యక్రమాలను వసతి గృహాల్లోనే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందుకే మహాత్మా జ్యోతిరావు పూలే గారి జయంతిని సమీకృత ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేయడం జరిగిందని, అదే విధంగా ఏప్రిల్ 14వ తేదీన కూడా డా.బిఆర్. అంబేద్కర్ గారి జయంతిని కూడా సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే గారిని జయంతి ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా గుర్తు పెట్టుకొని వారు చేసిన సేవలను గుర్తెరిగి వారి జయంతి ఉత్సవాలను జరుపుకోవడం అంటే వారి కృషి స్ఫూర్తినీయమన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే గారి కుటుంబం మహారాష్ట్రలోని ఒక గ్రామంలో కొంత భూమి ఉండేదని అందులో కూరగాయలు, పూల పెంపకం చేపట్టడం ద్వారా వారి పేరు చివరన పూలే అని రావడం జరిగిందన్నారు. చిన్నతనంలో తల్లి చనిపోవడం వల్ల తనకున్న తెలివి తేటలను సమాజం గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఉన్నత విద్యను అభ్యసించడం జరిగిందన్నారు. ముఖ్యంగా స్త్రీ విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం వల్ల స్త్రీలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా కృషి చేయడం జరిగిందన్నారు. అందుకు తన భార్య సావిత్రి బాయి పూలే గారిని విద్య వైపు ప్రోత్సహించి, 1848లో బాలికల కోసం పాఠశాలను ప్రారంభించి అందులో ఉపాధ్యాయురాలుగా వారిని ప్రోత్సహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వివక్ష నిర్మూలన కోసం ఎన్నో పుస్తకాలను రచించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల వివక్షతను పూర్తిగా నిర్మూలించడానికి సమీకృత ప్రభుత్వ వసతి గృహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా పిల్లలకు చిన్నతనం నుండే కుల వివక్షతను లేకుండా పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన ఒక సంఘటన జిల్లా కలెక్టర్ వివరిస్తూ తమిళనాడు నుండి వచ్చిన ఒక మహిళ వారి పిల్లలను పాఠశాలలో చేర్చే సమయంలో మీ కులం ఏంటి అని పాఠశాల సిబ్బంది అడుగగా "నో క్యాస్ట్" అని చెప్పడం జరిగిందని, అప్పుడు సదరు సిబ్బంది వారిని పాఠశాలలో చేర్చుకోవడానికి నిరాకరించారని, అప్పుడు వారు న్యాయం కోసం హైకోర్టు, సుప్రీమ్ కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం ఆదేశాల మేరకు నో క్యాస్ట్ సర్టిఫికేట్లు ఇవ్వాలని తహశీల్దార్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న తరుణంలో వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి చేయూతను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరంలో బిసి కార్పోరేషన్ ద్వారా 2156 ఋణాలు, ఎస్సీ కార్పోరేషన్ ద్వారా 954 ఋణాలు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 1920 ఋణాలు ఇచ్చి వారికి స్వయం ఉపాధి ద్వారా ఋణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 514 యూనిట్ల లబ్ధిదారులకు అనుమతులు మంజూరు చేస్తూ 12 కోట్ల 37 లక్షల 50వేల రూపాయల సబ్సిడీ అందరీ సహకారంతో మంజూరు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా కార్పొరేషన్, సంక్షేమం ద్వారా వివిధ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అదే విధంగా సమీకృత ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహంలో టాయిలెట్స్, త్రాగు నీరు, ఫ్లోరింగ్ సరిగ్గా లేవని వసతి గృహం సిబ్బంది గతంలో తెలుపగా యూనియన్ బ్యాంకు వారు ముందుకు వచ్చి టాయిలెట్స్ ను పూరి చేసినందుకు ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. అంతేకాకుండా రానున్న 15 రోజుల్లో త్రాగు నీరు, ఫ్లోరింగ్ కూడా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పి4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్ షిప్) కాన్సెప్ట్ ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇందుకు అందరూ ముందుకు వచ్చి వసతి గృహాలలో అన్ని సదుపాయాలు కల్పించేందుకు సహకరించాలన్నారు.

కార్యక్రమంలో భాగంగా బిసి, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా 514 మంది లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకం క్రింద రూ.12.37 కోట్ల మెగా చెక్కును అందజేశారు. అనంతరం సమీకృత ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహంలో మరమ్మత్తులు చేసిన టాయిలెట్స్ ను మంత్రి, జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించారు.

అనంతరం బిసి సంఘాల నాయకులు యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, నాగ శేషయాదవ్, గోవిందనాయుడు, గుర్రంలక్ష్మి, గౌరి, బోయ రామకృష్ణ, ఇతర సంఘాల నాయకులు తదితరులు మహాత్మ జ్యోతిరావు పూలే సమాజ అభివృద్ధి, విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఆర్.ఓబులేసు, బిసి కార్పోరేషన్ ఈడి జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే

**సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత -నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 11, (రిపబ్లిక్ న్యూస్):** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు ఈ రోజు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న ఐదు మంది పోలీసు సిబ్బంది వారి ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది ఇబ్బందులు పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని ఎస్పీ తెలియజేశారు.

## శక్తి యాప్స్, పోక్సో చట్టం, మహిళల అత్యవసర నెంబర్ల పై విస్తృతంగా అవగాహన

**నంద్యాల క్రైం, ఏప్రిల్ 11 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శక్తి టీం నోడల్ అధికారి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు పర్యవేక్షణలో జిల్లాలోని వివిధ స్కూల్, కాలేజీలు, ముఖ్యమైన కూడళ్ళు ,షాపింగ్ మాల్స్, సాయంత్రం వాకింగ్ చేసే ప్రదేశాలు మొదలగు ప్రాంతాలలో శుక్రవారం శక్తి టీం బృందాలు విస్తృతంగా పర్యటించి ప్రజలకు శక్తి యాప్, ఫోక్సో చట్టం, మహిళలపై జరిగే నేరాల గురించి అత్యవసర సమయంలో వినియోగించవలసిన టోల్ ఫ్రీ నంబర్ల గురించి అవగాహన కల్పించడం జరుగుతుంది. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే (ఎస్ఓఎస్) బటన్ ప్రెస్ చేయగానే






కొద్ది నిమిషాలలో పోలీసులు మీకు రక్షణ కల్పించడంతోపాటు సమాచారం మీ కుటుంబ సభ్యులకు కూడా చేరడం జరుగుతుందని ప్రజలకు వివరించారు. కాలేజీ లలో శక్తి వారియర్ గ్రూప్ లను ఏర్పాటు చేయాలని, గ్రూప్ యొక్క ప్రత్యేకతలను వివరించారు. అత్యవసర సమయంలో వినియోగించవలసిన టోల్ ఫ్రీ నంబర్ల గురించి మహిళలకు వివరిస్తూ చైల్డ్ మ్యారేజ్ కు సంబంధించి 1098, సైబర్ క్రైమ్ కు సంబంధించి 1930, ఏదైనా ఎమర్జెన్సీ డయల్ 100,112, నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చునని, నంద్యాల జిల్లాలో ఎవరైనా మీ యొక్క మొబైల్ పోగొట్టుకుంటే 9121101107 కు హాయ్ అని వాట్సాప్ లో మెసేజ్ చేసిన వెంటనే మీకు వచ్చే లింక్ సహాయంతో మీ వివరాలు పూర్తిచేసిన తర్వాత పోలీసు వారు వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.







printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com